ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 146 శుక్రవారం 15 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-
Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 146 Friday 15 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


## వాహన కాన్వాయ్‌ను తగ్గించుకోనున్న సీఎం రేవంత్ రెడ్డి

- మోదీ పొదుపు మంత్రం
- చమురు వినియోగంపై పొదుపు పాటించాలని ప్రధాని మోదీ పిలుపు
- ఆ దిశగా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల చర్యలు
- తన వాహన కాన్వాయ్‌ను కూడా తగ్గించాలని అధికారులకు సూచించిన సీఎం రేవంత్ రెడ్డి



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 14 :** చమురు పొదుపు విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఒక ముందడుగు వేసినట్లు తెలుస్తోంది. ఆయన తన కాన్వాయ్‌లోని వాహనాలను అవసరాన్ని బట్టి తగ్గించాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. ఇందుకు అనుగుణంగా ఇంటిలిజెన్స్ ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు. అయితే ప్రస్తుతం 9 వాహనాలతో సీఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్ కొనసాగుతుంది. చమురు పొదుపు వేళ అది 4 నుంచి 5 వాహనాల వరకు కుదిస్తారని అధికార వర్గాల నుంచి విశ్వసనీయ - మిగతా 2 లో

## మంత్రి సీతక్కకు కవిత విజ్ఞప్తి



- స్త్రీ నిధిలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలన్న కవిత
- స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన ఎండీపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- సంస్థను తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశాడని ఆరోపణ

## తెలంగాణలో కొత్త పార్కింగ్ పాలసీ




- అడ్డగోలుగా పార్క్ చేస్తే వాహనం వేలానికే!
- తెలంగాణలో కొత్త పార్కింగ్ పాలసీకి ప్రభుత్వ సన్నాహాలు
- అక్రమ పార్కింగ్ వాహనాలను స్వాధీనం చేసుకోనున్న అధికారులు
- టోయింగ్, పార్కింగ్ ఛార్జీలతో పాటు పాత చలాన్ల చెల్లింపు తప్పనిసరి
- నిర్ణీత గడువులోగా తీసుకోకపోతే వాహనాల వేలం
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రవాణా శాఖ ముసాయిదా రూపకల్పన

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 14 :** తెలంగాణలో వాహనాల పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. రోడ్లపై అడ్డగోలుగా వాహనాలు నిలపడం, రోజుల తరబడి వదిలేయడం వంటి - మిగతా 2 లో

## కర్ణాటకలో హిజాబ్‌పై నిషేధం ఎత్తివేత



2 లో

- కాంగ్రెస్ సర్కార్ కీలక నిర్ణయం
- హిజాబ్‌తో పాటు జనివారం, తలపాగా వంటి వాటికి అనుమతి
- గత బీజేపీ ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసిన కాంగ్రెస్ సర్కార్
- మత విశ్వాసాల మధ్య సమతుల్యం కోసమే నిర్ణయమన్న ప్రభుత్వం

## అది అగ్నిపర్వతమా, కాదా?

- పసిఫిక్ మహాసముద్రంలో వీడని మిస్టరీ!
- పసిఫిక్ మహాసముద్రం అడుగున ఉన్న భారీ నిర్మాణం 'తము మాసిఫ్'
- దీనిని ప్రపంచంలోనే అతిపెద్ద అగ్నిపర్వతంగా తొలుత భావించారు
- అయితే, ఇది ఒకే అగ్నిపర్వతం కాదని కొత్త పరిశోధనలో వెల్లడైంది
- సముద్ర గర్భం విస్తరించే ప్రక్రియలో ఇది ఏర్పడినట్లు శాస్త్రవేత్తల నిర్ధారణ
- అగ్నిపర్వతం కాకపోయినా,భూమిపై అతిపెద్ద నిర్మాణాలలో ఒకటిగా గుర్తింపు

**వార్త సంధ్య, ఢిల్లీ , మే 14 :** పసిఫిక్ మహాసముద్రం లోతుల్లో దాగి ఉన్న ఒక అద్భుతమైన భౌగోళిక నిర్మాణం శాస్త్ర ప్రపంచంలో పెద్ద చర్చకు దారితీసింది. తము మాసిఫ్ అని పిలువబడే ఈ భారీ పర్వత వ్యవస్థ, ఒకప్పుడు భూమిపైనే అతిపెద్ద అగ్నిపర్వతంగా భావించబడింది. అయితే, తర్వాతి కాలంలో లభించిన ఆధారాలు ఈ వాదనను సవాలు చేశాయి. దీంతో ఈ నిర్మాణం యొక్క పుట్టుక గురించి శాస్త్రవేత్తలు పునరాలోచించాల్సి వచ్చింది. వాయవ్య పసిఫిక్‌లోని షాట్స్కీ రైజ్ అనే ప్రాంతంలో సముద్ర గర్భంలో ఉన్న ఈ నిర్మాణాన్ని నేరుగా చూడటం సాధ్యం కాదు. అయినప్పటికీ, భూకంప తరంగాల అన్వేషణ, శిలలను తవ్వడం వంటి పద్ధతులతో దీనిపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. 2013లో 'నేచర్ జియోసైన్స్' పత్రికలో ప్రచురించిన ఒక అధ్యయనం సంచలనం సృష్టించింది. - మిగతా 2 లో



## హంటావైరస్‌కు విరుగుడు సిద్ధం

- కానీ నిధుల కొరతే శాపం!
- క్రూయిజ్ షిప్‌లో హంటావైరస్ వ్యాప్తితో డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిక
- మనిషి నుంచి మనిషికి సోకే వైరస్
- నిధుల కొరతతో నిలిచిపోయిన హంటావైరస్ చికిత్స పరిశోధన
- క్లినికల్ ట్రయల్స్ దశలో ఆగిపోయిన చిలీ శాస్త్రవేత్త డాక్టర్ బరియా బృందం
- పరిశోధనలు మళ్లీ మొదలుపెట్టాలంటే 7 మిలియన్ డాలర్ల నిధులు అవసరం


2 లో

## హిందువులకు క్షమాపణ చెప్పిన కమెడియన్ అలీ


2 లో

- 'ఘర్ సోప్' ప్రకటన వివాదంపై క్షమాపణ చెప్పిన నటుడు అలీ
- సోప్‌కు లక్ష్మీ పూజ చేయడం హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని విమర్శలు
- సోషల్ మీడియాలో వెల్లువెత్తిన వ్యతిరేకత, బాయ్‌కాట్ పిలుపులు
- వివాదాస్పద యాడ్‌ను వెంటనే తొలగించాలని కంపెనీని కోరిన అలీ
- ఎవరినీ కించపరిచే ఉద్దేశం తనకు లేదని వీడియో ద్వారా వివరణ

## రాయలసీమ ఇకపై 'రక్షణ సీమ'



- ఏఎంసీఏ ప్రాజెక్టుతో ఏపీలో నవ శకం
- రాయలసీమను డి హబ్‌గా మార్చే దిశగా ప్రభుత్వ భారీ అడుగులు
- పుట్టపర్తిలో రూ.15,803 కోట్లతో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి భూమిపూజ చేయనున్న సీఎం చంద్రబాబు
- డ్రోన్, డిఫెన్స్ రంగాల్లో మరో 12 కంపెనీల ప్రాజెక్టులకు శ్రీకారం
- వేల కోట్ల పెట్టుబడులతో పాటు వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు

**వార్త సంధ్య, అమరావతి, మే 14 :** ఒకప్పుడు రత్నాలకు, ఆ తర్వాత ఉద్యాన పంటలకు నెలవైన రాయలసీమ, ఇప్పుడు దేశ రక్షణ రంగంలో కీలక భూమిక పోషించేందుకు సిద్ధమవుతోంది. స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి కేంద్రంగా నిలవనుంది. 'రతనాల సీమ'గా చరిత్రలో, - మిగతా 2 లో

## వారంలో ఒక రోజు 'నో వెహికిల్ డే'

- ఏపీ క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయం
- "నా దేశం - నా బాధ్యత" పేరుతో ఏపీలో పొదుపు చర్యలు ప్రారంభించిన ప్రభుత్వం
- మంత్రులు, ఎమ్మెల్యేలు కాన్వాయ్‌లు, విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని సీఎం ఆదేశం
- వారానికి ఒక రోజు 'నో వెహికల్ డే', సైకిళ్ల వాడకాన్ని ప్రోత్సహించాలని సూచన
- బంగారం కొనుగోళ్లు తగ్గించి, స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలని పిలుపు
- ఇది భయపెట్టడానికి కాదు, సంక్షోభాన్ని ఎదుర్కొనే ముందుజాగ్రత్త చర్య అని స్పష్టీకరణ



**వార్త సంధ్య, అమరావతి, మే 14 :** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. "నా దేశం - నా బాధ్యత" అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. సమావేశం - మిగతా 2 లో

# సంపాదకీయం

## పొదుపు కాలం

ఎన్నికల హోరు సద్దుమణిగి, రాష్ట్రాలన్నిటా ప్రభుత్వాల ఏర్పాటు పూర్తికావస్తున్న దశలో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం దేశ పౌరులనుద్దేశించి ఒక హెచ్చరిక లాంటి హితోపదేశం చేశారు. పశ్చిమాసియా యుద్ధ పర్యవసానంగా ఏర్పడిన సంక్షోభాన్ని అధిగమించటానికి కోవిడ్ కాలంలో అనుసరించిన పొదుపు చర్యలు తప్పనిసరంటూ పౌరులకు సూచించారు. ఆయన చెప్పినవాటిల్లో వర్క్ ఫ్రం హోం, ప్రజారవాణా వ్యవస్థల వినియోగం, ఏడాదిపాటు బంగారం కొనుగోళ్ల నిలిపివేత, విదేశీ ప్రయాణాలు మానుకోవటం, రైతులు యూరియా వాడకాన్ని తగ్గించటం వంటివి ఉన్నాయి. ఇందులో చాలా వరకూ పాటించదగ్గవే. దీనికితోడు 'పర్యావరణ పరిరక్షణ' కోసం ప్రతి ఆదివారం పెట్రోల్ బంక్‌లు మూసేస్తారు. సోమవారం వెల్లడైన వివరాలనుబట్టి చమురు సంస్థలు రోజూ రూ. 1,700 కోట్లు నష్టపోతున్నాయని తెలుస్తోంది. గత పది రోజుల్లో మొత్తంగా నష్టాలు రూ. లక్ష కోట్ల మేర ఉన్నాయనీ దాని సారాంశం. నిజానికి ఎన్నికల ప్రచారపర్వం మధ్యలో మోదీ ఒకసారి చూచాయగా పరిస్థితి తీవ్రతను చెప్పారు. కానీ ఎన్నికల అనంతరం పెట్రో ధరలు భారీగా పెరుగుతాయనీ, పర్యవసానంగా అన్ని సరుకుల ధరవరలూ ఆకాశాన్నంటుతాయనీ విపక్షాలు ప్రచారం చేయటంతో బీజేపీ బెంబేలుపడి ఇక దాని జోలికిపోలేదు. దేశ ప్రజల్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భయాందోళనలకు గురి చేస్తున్నారని ఆ పార్టీ ఆరోపించింది. పశ్చిమాసియా ఉద్రిక్తత ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను బెంబేలెత్తిస్తోంది. హోర్మూజ్ జలసంధిని ఇరాన్, అమెరికాలు దిగ్బంధించటంతో ఇంధన సరఫరా నిలిచిపోయింది. మన దేశం మాత్రమే వీటన్నిటికీ అతీతంగా మనుగడ సాగిస్తుందనీ, మన ఆర్థిక వ్యవస్థ అన్నిటినీ తట్టుకోగలదనీ భావించటం అమాయకత్వం. చైనా మొదలుకొని ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్, శ్రీలంక తదితర దేశాలు ఇప్పటికే రక రకాల చర్యలు అమల్లోకి తెచ్చాయి. చమురు ఎగుమతులన్నీ ఆపేయాలని దేశంలోని చమురుశుద్ధి కర్మాగారాలను చైనా ఆదేశించటంతోపాటు పెట్రో ధరల్ని కూడా పెంచింది. జెట్ ఇంధనం ధరలు పెరగటంతో అక్కడి ఎయిర్‌లైన్స్ సంస్థలు పలు సర్వీసుల్ని నిలి పేశాయి. ఫిలిప్పీన్స్ మార్చిలోనే జాతీయ ఆత్యయిక స్థితిని ప్రకటించింది. వారానికి నాలుగు రోజుల పనిదినాల్ని ప్రకటించింది. ఆస్ట్రేలియాలో కొన్ని రాష్ట్రాలు ప్రజా రవాణా వ్యవస్థను ఉచిత సర్వీసుగా మార్చటం లేదా టికెట్ ధరలు తగ్గించటం వంటి చర్యలు తీసుకున్నాయి. సొంత వాహనాల వాడకం తగ్గించటమే దీని ఉద్దేశం. శ్రీలంక కూడా వారానికి నాలుగు రోజుల పనివిధానం ప్రకటించి, వారానికి ఒకరోజు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించటంతోపాటు ఇంధనంపై రేషన్ విధించింది. హోర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్, అమెరికా పంతాలకు పోవటంతో 1,500 నౌకలు నిలిచిపోయాయి. అందులో మన నౌకలు 13 వరకూ ఉన్నాయి. తాజాగా ఇరాన్ ప్రతిపా దనల్ని అమెరికా తోసిపుచ్చడంతో యుద్ధం ఇప్పట్లో సద్దుమణుగుతుందన్న ఆశ అడుగంటింది. ఉన్నకొద్దీ పరిస్థితి ముదరవచ్చు. అందుకే ప్రధాని చెప్పిన పొదుపు చర్యలు తక్షణ కర్తవ్యం. అయితే ఈ ఆచరణ ప్రభుత్వాలపరంగా మొదలుకావాలి. ఆర్భాటాల్లేకుండా శంకుస్థాపనలూ, ప్రారంభోత్సవాలూ ముగించటం, సాధ్యమైనంతవరకూ ప్రత్యేక విమానాల వాడకం ఆపేయటం, సీఎంలు, మంత్రుల కాన్వాయ్‌లలో పదులకొద్దీ వాహనాల వినియోగం వంటివి విరమించుకోవాలి. ఇక ఏపీ వరకూ చూస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ల నివాసాలు హైదరాబాద్‌లో ఉన్నాయి. వారాంతంలో ప్రత్యేక విమానాల్లో వచ్చి వెళ్తుంటారు. ఇలాంటి దుబారా అవసరమా?మన దిగుమతుల్లో బంగారం, చమురు సింహభాగం ఆక్రమిస్తాయి. 202526లో బంగారం దిగుమతుల విలువ 7,200 కోట్ల డాలర్లు. మనకు అవసరమైన చమురులో 90 శాతంమేర దిగుమతి చేసుకుంటున్నాం. మొన్న ఏప్రిల్ 24కు మన విదేశీ మారకద్రవ్య నిల్వలు 69,000 కోట్ల డాలర్లయితే, ఒక్క వారంలో అంటే... ఈనెల 1 నాటికి అందులో 779 కోట్ల డాలర్లమేర హరించుకుపోయాయి. ఇదే వరస కొనసాగితే సంక్షోభం మరింత తీవ్రమవుతుంది. అయితే ఏమేరకు పొదుపు అవసరమనేది కూడా చూసుకోవాలి. అది మితిమీరినా ఆర్థికవ్యవస్థకు చేటు తప్పదు. కనుక సమతుల్యత అత్యవసరం.

# కర్ణాటకలో హిజాబ్‌పై నిషేధం ఎత్తివేత

**మొదటిపేజీ తరువాయి -** కర్ణాటకలోని పాఠశాలల్లో హిజాబ్ వివాదంపై కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై విద్యార్థులు హిజాబ్‌తో పాటు జనివారం, తలపాగా వంటి మత, సంప్రదాయ చిహ్నాలను ధరించేందుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు 2022లో గత బీజేపీ ప్రభుత్వం జారీ చేసిన నిషేధ ఉత్తర్వులను రద్దు చేసింది.విద్యాశాఖ ఖరారు చేస్తున్న కొత్త నిబంధనల ప్రకారం విద్యార్థులు తమ యూనిఫాంతో పాటు జనివారం, తలపాగా, రుద్రాక్ష, శివధార, హిజాబ్, స్కార్ఫ్ వంటివి ధరించి తరగతులకు, పరీక్షలకు హాజరుకావచ్చు. విద్యాసంస్థల్లో క్రమశిక్షణతో పాటు, విద్యార్థుల మత, సాంస్కృతిక పద్ధతులకు గౌరవం ఇచ్చేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.ఈ



నిర్ణయంపై విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప మాట్లాడుతూ పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించినట్లు తెలిపారు. ఏప్రిల్ 24న ఒక విద్యార్థి జనివారాన్ని పరీక్ష హాలులో బలవంతంగా తీయించిన ఘటన తర్వాత దీనిపై చర్చ జరిగిందని ఆయన వివరించారు. "సంప్రదాయ, మతపరమైన ఆచారాల వల్ల పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదు. అందుకే ఈ మార్గదర్శకాలు రూపొందించాం" అని ఆయన అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు.2022లో కొందరు ముస్లిం విద్యార్థినులు హిజాబ్ ధరించి తరగతులకు రావడంపై అభ్యంతరాలు రావడంతో అప్పటి బీజేపీ ప్రభుత్వం యూనిఫామ్ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత కర్ణాటక హైకోర్టు కూడా ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థిస్తూ, హిజాబ్ ఇస్లాంలో తప్పనిసరి మతపరమైన ఆచారం కాదని తీర్పు ఇచ్చింది.

# హిందువులకు క్షమాపణ చెప్పిన కమెడియన్ అలీ



**మొదటిపేజీ తరువాయి -** టాలీవుడ్ సీనియర్ కమెడియన్ అలీ, తాను నటించిన ఒక వాణిజ్య ప్రకటనపై చెలరేగిన వివాదంపై స్పందించారు. హిందూ సమాజానికి, మనోభావాలు దెబ్బతిన్న ప్రతి ఒక్కరికీ ఆయన బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. ఘర్ సోప్ కోసం ఆయన చేసిన ప్రకటనలో హిందూ మత విశ్వాసాలను అవమా నించేలా దృశ్యాలు ఉన్నాయంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో అలీ ఈ మేరకు వివరణ ఇచ్చారు.ఘర్ సోప్ కోసం రూపొందించిన వాణిజ్య ప్రకటనలో నటుడు అలీ ఒక పూజ గదిలో కూర్చుని, ఒక సబ్బు బిళ్లకు లక్ష్మీ పూజ చేస్తున్నట్లు చిత్రీకరించారు. పూలు, ఇతర పూజా సామగ్రితో సబ్బును ఆరాధిస్తూ, నేపథ్యంలో లక్ష్మీదేవికి సంబంధించిన భక్తి గీతాలు వినిపించడం తీవ్ర అభ్యంతరాలకు దారితీసింది. పవిత్రమైన లక్ష్మీ పూజను ఒక సాధారణ సబ్బు ఉత్పత్తికి వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించడం హిందూ ఆచారాలను అపహాస్యం చేయడమేనని పలు హిందూ సంఘాలు, నెటిజన్లు ఆరోపించారు.ఈ ప్రకటన సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో, దానిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. వాణిజ్య ప్రచారం కోసం మతపరమైన నమ్మకాలను కించపరచడం సరికాదంటూ బాయ్‌కాట్ పిలుపులు కూడా వచ్చాయి. దీంతో వివాదం పెద్దది కావడంతో అలీ స్పందించక తప్పలేదు.ఈ నేపథ్యంలో ఒక వీడియో సందేశాన్ని విడుదల చేసిన అలీ, "నా ప్రకటన వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే నన్ను క్షమించండి. ఏ మతాన్ని గానీ, వారి నమ్మకాలను గానీ కించపరిచే ఉద్దేశం నాకు ఎప్పుడూ లేదు," అని విజ్ఞప్తి చేశారు. ఆ యాడ్ ఒక పాత సినిమాలోని సన్నివేశం స్ఫూర్తితో తీశారని, అయినా ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సదరు ప్రకటనను తక్షణమే తొలగించాలని ఘర్ సోప్ యాజమాన్యాన్ని తాను కోరినట్లు అలీ వివరించారు. అలీ క్షమాపణ చెప్పడంతో ఈ వివాదం కొంతవరకు సద్దుమణిగినా, వాణిజ్య ప్రకటనలలో మతపరమైన అంశాల వినియోగంపై ఈ సంఘటన మరోసారి చర్చకు దారితీసింది.

# హంటావైరస్‌కు విరుగుడు సిద్ధం

**మొదటిపేజీ తరువాయి -** అర్జెంటీనా నుంచి యూరప్ వెళ్తున్న ఓ క్రూయిజ్ షిప్‌లో ప్రాణాంతక హంటావైరస్ కలకలం రేపింది. ఈ ఘటనలో పలువురు మరణించగా, మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ఈ పరిణామం ఏళ్ల క్రితమే ఈ వైరస్‌కు విరుగుడు కనుగొనే అంచున నిలిచి, నిధుల కొరతతో వెనకడుగు వేసిన ఓ శాస్త్రవేత్త పరిశోధనను మళ్లీ ప్రపంచం ముందు నిలిపింది.చిలీకి చెందిన ఇమ్యూనోవైరాలజీ శాస్త్రవేత్త డాక్టర్ బరియా, ఆమె బృందం 2016 లోనే హంటావైరస్‌ను నిర్వీర్యం చేసే యాంటీబాడీలను అభివృద్ధి చేయడంలో కీలక పురోగతి సాధించారు. ఈ వైరస్ సోకిన ప్రతి ముగ్గురిలో ఒకరిని బలి తీసుకుంటుంది. బరియా బృందం అభివృద్ధి చేసిన యాంటీబాడీలు ప్రయోగశాలలో వైరస్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశాయి. జంతువులపై జరిపిన ప్రయోగా ల్లోనూ అద్భుత మైన ఫలితాలు వచ్చాయి. ఊపిరితిత్తుల నుంచి ఇన్‌ఫెక్షన్‌ను పూర్తిగా తొలగించగల శక్తి ఈ యాంటీబాడీలకు ఉన్నట్టు తేలింది.దీంతో, మానవులపై క్లినికల్ ట్రయల్స్ ప్రారంభిం చేందుకు అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి పనిచేయడానికి వారు సిద్ధమయ్యారు. అయితే, దీనికి సుమారు 7 మిలియన్ డాలర్లభారీ మొత్తం అవస రమైంది. అంతర్జాతీ య నిధుల కోసం ప్రయత్నిస్తున్న సమయంలోనే కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని చుట్టుముట్టింది. దీంతో శాస్త్రవేత్తల దృష్టి, ప్రభుత్వాల నిధులు అన్నీ కరోనా వైపు మళ్లాయి. ఫలితంగా, హంటా వైరస్‌పై జరగాల్సిన కీలక పరిశోధన నిలిచిపోయింది. ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన హంటా వైరస్ 'ఆండీస్' జాతికి చెందింది. ఇది మనిషి నుంచి మనిషికి వ్యాపి ంచే ఏకైక హంటావైరస్ కావడంతో దీనిపై ఆందోళన ఎక్కువగా ఉంది. చిలీ, అర్జెంటీనా దేశాల్లో ఈ వైరస్ ప్రభావం ఎక్కువ. ఒక్క 2026లోనే చిలీలో 39 కేసులు, 13 మరణాలు నమోదయ్యాయి. "నిధులు, వనరుల కొరతే మా పరిశోధనలకు ప్రధాన అడ్డంకిగా మారింది. ఇప్పుడు నిధులు సమకూరినా, మేం ఆగిన చోట నుంచి మళ్లీ మొదలుపెట్టడానికి కనీసం 12 నుంచి 24 నెలల సమయం పడుతుంది" అని డాక్టర్ బరియా ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం క్రూయిజ్ షిప్ ఘటనతో ఈ వైరస్‌పై మళ్లీ ప్రపంచవ్యాప్తంగా చర్చ మొదలైంది. అయితే, చేతికి వచ్చినట్టే వచ్చి, అందుబాటులో ఉండాల్సిన చికిత్స కేవలం నిధుల కొరత కారణంగా అందు బాటులోకి రాకపోవడం ఆందోళన కలిగించే విషయం.

# వారంలో ఒక రోజు 'నో వెహికిల్ డే'

**మొదటిపేజీ తరువాయి -**

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమాజం సిద్ధంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఇంధన దిగుమతులు, విదేశీ మారక ద్రవ్యంపై తీవ్ర ఒత్తిడి పడుతోందని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పొదుపు చర్యలు పాటించడం ద్వారా దేశానికి మేలు చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చినట్లు తెలిపారు.ఈ పొదుపు చర్యలు తొలుత ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచే ప్రారంభం కావాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని పార్థసారథి తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలను పూర్తిగా రద్దు చేసుకోవాలన్నారు. వీలైతే ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని, సమీప ప్రాంతాలకు వెళ్లేటప్పుడు కార్లకు బదులుగా నడక లేదా సైకిల్‌ను ఆశ్రయించాలని సీఎం కోరారు.వారానికి ఒక రోజు (శుక్రవారం) 'నో వెహికల్ డే' పాటించాలని, ఆ రోజు వాహనాలు వినియోగించకుండా వర్చువల్ విధానంలో సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. అధికారులు కూడా వాహనాలను షేర్ చేసుకోవడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఇంధన వినియోగంపై వారానికోసారి సమీక్షించాలని, కొత్తగా కొనుగోలు చేసే వాహనాలు ఎలక్ట్రిక్ (ఈవీ) వాహనాలే అయి ఉండాలని క్యాబినెట్ నిర్ణయించింది.ప్రజలు కూడా ఈ సంక్షోభ సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి కోరారు. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లే బదులు స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. బంగారం కొనుగోళ్లపై మోజు తగ్గించుకోవాలని, దీనివల్ల ఏటా వేల కోట్ల డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని అన్నారు. "స్టెప్ ఫర్ ది నేషన్" పేరుతో నడక, సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు.ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయి ంచినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఇంధన, వ్యవసాయ రంగాల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టాలని సీఎం ఆదేశించారన్నారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 'పీఎం సూర్యఘర్', 'కుసుమ్' వంటి సౌర విద్యుత్ పథకాలను మరింత వేగవంతం చేయాలని ఇంధన శాఖను ఆదేశించినట్లు చెప్పారు. ప్రస్తుతం లక్షల మందికి మాత్రమే చేరిన ఈ పథకాలను విస్తృతం చేసేందుకు అవసరమైన పరికరాల తయారీదారులతో, సప్లై చైన్‌తో చర్చలు జరపాలని సూచిం చారన్నారు. అలాగే, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) వంటి ప్రత్యామ్నాయ ఇంధన ప్లాంట్ల ఏర్పాటుకు భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారన్నారు.వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిపోయిందని, ముఖ్యంగా యూరియా వినియోగంలో రైతుల మధ్య చాలా వ్యత్యాసం ఉందని పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రైతులు ఎకరానికి రెండు బస్తాలు వాడుతుంటే, మరికొందరు మూడు, నాలుగు బస్తాలు వాడుతున్నారని, ఇది శాస్త్రీయంగా సరైంది కాదన్నారు.అధిక దిగుబడి కోసం కెమికల్స్ వాడకం వల్ల భూసారం దెబ్బతింటోందని, దీన్ని తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖకు సీఎం సూచించారని తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా వచ్చిన 'నానో యూరియా' వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. డ్రోన్ల సహాయంతో నానో యూరియాను పొలం అంతటా సమానంగా చల్లడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని, రైతులు ఈ దిశగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.ఈ చర్యలన్నీ ప్రజలను భయపెట్ట డానికి కాదని, కేవలం సంభావ్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి సమాజాన్ని సన్నద్ధం చేయడానికేనని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. "రాబోయే ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి తప్ప, ఆదాయం తగ్గిపోతుందని ఆలోచిం చకూడదు. దేశ ప్రయోజనాలే ముఖ్యం" అని ఆయన పేర్కొన్నారు. ఇంధన పొదుపు వల్ల రాష్ట్రానికి వచ్చే పన్ను ఆదాయం తగ్గవచ్చనే ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు.( పభుత్వం ఇతర మార్గాల్లో ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తోందని, త్వరలోనే రాష్ట్రానికి రూ. 1.5 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు రాబోతున్నాయని తెలిపారు. ఈ పొదుపు చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐ&పీఆర్ శాఖ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.

# అది అగ్నిపర్వతమా, కాదా?

**మొదటిపేజీ తరువాయి -** తము మాసిఫ్ అనేది ఒకే కేంద్రం నుంచి లావా విస్తరించి ఏర్పడిన అతిపెద్ద అగ్నిపర్వత కవచం అని శాస్త్రవేత్తలు ప్రకటించారు. దీని విస్తీర్ణం దాదాపు అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్రమంత ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణతో భూమిపై ఇంతటి భారీ అగ్నిపర్వత వ్యవస్థలు కూడా ఏర్పడగలవని ప్రపంచం ఆశ్చర్యపోయింది.అయితే, 2019లో అదే 'నేచర్ జియోసైన్స్' పత్రికలో ప్రచురితమైన మరో అధ్యయనం ఈ సిద్ధాంతాన్ని తలకిందులు చేసింది. అయస్కాంత వైరుధ్యాలను విశ్లేషించిన శాస్త్రవేత్తలు, తము మాసిఫ్ ఒకే అగ్నిపర్వత బిలం నుంచి ఏర్పడలేదని నిర్ధారించారు. లావా ఘనీభవించేటప్పుడు భూమి యొక్క అయస్కాంత క్షేత్రానికి అనుగుణంగా శిలల్లో అయస్కాంత చారలు ఏర్పడతాయి. ఈ చారలను విశ్లేషించినప్పుడు, తము మాసిఫ్ ఒకే కేంద్రం నుంచి కాకుండా, సముద్ర గర్భం విస్తరించే ప్రక్రియలో భాగంగా ఏర్పడిందని వారు కనుగొన్నారు. అంటే ఇది కేవలం అగ్నిపర్వత చర్య కాదని, భూమి యొక్క టెక్టోనిక్ ప్రక్రియల కలయిక ఫలితమని తేలింది.ఈ వివాదం ఉన్నప్పటికీ, తము మాసిఫ్ ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గలేదు. ఇది ఒకే అగ్నిపర్వతం కాకపోయినా, భూ గ్రహం మీద ఉన్న అతిపెద్ద అగ్నిపర్వత నిర్మాణాలలో ఒకటిగా నిలుస్తుంది. ప్రారంభ అధ్యయనంలో పాలుపంచుకున్న హ్యూస్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన భూగర్భ శాస్త్రవేత్త విలియం సేగర్, ఈ వివాదం శాస్త్రీయ జ్ఞానం ఎలా అభివృద్ధి చెందుతుందో చూపిస్తుందని అన్నారు. ఒక ఆధారం ఒక పరికల్పనకు దారితీస్తే, కొత్త ఆధారం దానిని ఎలా సవరించి పూర్తి చిత్రాన్ని అందిస్తుందో చెప్పడానికి తము మాసిఫ్ ఒక ఉదాహరణ అని ఆయన వివరించారు. ముగింపుగా, తము మాసిఫ్ సులభమైన వర్గీకరణకు లొంగని ఒక సంక్లిష్ట నిర్మాణం. పసిఫిక్ సముద్రం అడుగున ఇంకా వెలుగులోకి రాని ఎన్నో అద్భుతాలు ఉన్నాయని చెప్పడానికి ఇది ఒక నిలువెత్తు నిదర్శనం.

## వాహన కాన్వాయ్‌ను తగ్గించుకోనున్న సీఎం రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి -** సమాచారం. మరిన్ని వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.ఆదర్శంగా మోదీ ఆలోచన : చమురు వినియోగం సాధ్యమైనంత తగ్గించాలని, వర్క్ ఫ్రం హోం బెటర్ ఆప్షన్ అని ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మోదీ ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇంధనాన్ని పొదుపు చేసే ప్రయత్నంలో భాగంగా స్వయంగా దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. తన అధికారిక (ప్రధానమంత్రి) కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను దాదాపు సగానికి తగ్గించారు. అదే విధంగా బంగారం కొనుగోళు ,, ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై ఆసక్తికరంగా ప్రసంగించిన విషయం తెలిసిందే.గవర్నర్ కాన్వాయ్ కుదింపు : ఇంధన వాడకాన్ని తగ్గించాలన్న ప్రధాని పిలుపు మేరకు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా తన కాన్వాయ్‌లోని వాహనాలను సగానికి పైగా తగ్గించాలని ఆదేశించారు. సీఎం, మంత్రులు కూడా కాన్వాయ్‌ను తగ్గించుకోవాలన్న ఆయన స్వదేశీ వస్తువుల వినియోగంపై దృష్టి సారించాలని అన్నారు.చర్యలు పాటిస్తున్న మంత్రులు : దీంతో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వాహన కాన్వాయ్ తగ్గింపు చర్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. తమ కాన్వాయ్‌లలో ఉపయోగించే వాహనాల సంఖ్యను తగ్గించాలని ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఇకపై జిల్లాల్లో పర్యటించేటప్పుడూ కాన్వాయ్‌లలోని వాహనాలను సగం తగ్గించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రులు, ఇతర వీఐపీలూ సాధ్యమైనంత తక్కువ వాహనాలను వినియోగించి చమురు పొదుపు అంశాన్ని చూడాలని సూచించారు.మార్గదర్శకాలు జారీ చేసిన మహారాష్ట్ర : ఇప్పటికే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్ కాన్వాయ్‌లోని వాహనాలను తగ్గించుకున్నారు. మరోవైపు మహారాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా కఠిన నిర్ణయాలు తీసుకుంటుంది. ఉన్నతాధికారులతో సహా ప్రజాప్రతినిధులు చమురు పొదుపు చర్యలు పాటించాలని మార్గదర్శకాలు జారీ చేసింది.

# తెలంగాణలో కొత్త పార్కింగ్ పాలసీ

**మొదటిపేజీ తరువాయి -** చర్యలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ కొత్త పార్కింగ్ పాలసీ ముసాయిదాను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రూపుదిద్దుకున్న ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, వాహనదారుల జేబుకు చిల్లు పడటమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాహనాన్ని కోల్పోయే ప్రమాదం కూడా ఉంది.ఈ ముసాయిదాలోని నిబంధనల ప్రకారం ఇకపై ఎక్కడపడితే అక్కడ వాహనాన్ని పార్క్ చేస్తే కేవలం జరిమానాతో వదిలిపెట్టరు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా, ఫుట్‌పాత్‌లపై, నో పార్కింగ్ జోన్లలో ఉన్న వాహనాలను అధికారులు వెంటనే టోయింగ్ చేసి స్వాధీనం చేసుకుంటారు. వాహన యజమాని తన బండిని తిరిగి పొందాలంటే టోయింగ్ ఛార్జీలు, వాహనాన్ని యార్డులో ఉంచినన్ని రోజులకు రోజువారీ పార్కింగ్ ఫీజు చెల్లించాలి. అంతేగాక ఆ వాహనంపై ఉన్న పెండింగ్ చలాన్లు, ఇతర జరిమానాలు మొత్తం చెల్లించిన తర్వాతే వాహనాన్ని అప్పగిస్తారు.ఈ కొత్త విధానంలో అత్యంత కీలకమైన అంశం వాహనాల వేలం. అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాన్ని నెల నుంచి 45 రోజుల్లోగా యజమాని క్లెయిమ్ చేసుకోకపోతే, ఆ వాహనాన్ని ప్రభుత్వపరం చేసి బహిరంగ వేలం వేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇలా స్వాధీనం చేసుకున్న వాహనాలను భద్రపరిచేందుకు పీపీపీ పద్ధతిలో ప్రత్యేక పార్కింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని కూడా రవాణా శాఖ ప్రతిపాదించింది.నిర్బంధించిన వాహనాలకు విధించే రోజువారీ పార్కింగ్ ఫీజులను కూడా ముసాయిదాలో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రాంతాలను బట్టి ఈ ఛార్జీలు మారతాయి. ద్విచక్ర వాహనానికి రోజుకు రూ.20 నుంచి రూ.30, ఆటోకు రూ.35 నుంచి రూ.50, కారుకు రూ.60 నుంచి రూ.80, బస్సు లేదా లారీకి రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ముసాయిదా దశలో ఉన్న ఈ పాలసీని ప్రభుత్వం ఆమోదించిన తర్వాత ప్రజల నుంచి సూచనలు, అభ్యంతరాలు స్వీకరించి తుది మార్పులతో అమలు చేయనుంది.

# రాయలసీమ ఇకపై 'రక్షణ సీమ'

**మొదటిపేజీ తరువాయి -** 'ఉద్యాన సీమ'గా వర్తమానంలో నిలిచిన ఈ ప్రాంతం, భవిష్యత్తులో 'రక్షణ సీమ'గా సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో రక్షణ, డ్రోన్ రంగాల్లో వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు రాయలసీమ వేదిక కానుంది. ఇందులో భాగంగా, శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఏఎంసీఏ ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది దేశ రక్షణ వ్యవస్థలో గేమ్ ఛేంజర్‌గా భావిస్తున్న అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రాజెక్టుకు పుట్టపర్తిలో పునాది రాయి పడనుంది. ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ), డీఆర్‌డీఓ సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. సుమారు రూ.15,803 కోట్ల భారీ బడ్జెట్‌తో, 650 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఈ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారు.ఈ ప్రాజెక్టులో భాగంగా, భారతదేశపు మొట్టమొదటి 5వ తరం స్టెల్త్ మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను అభివృద్ధి చేస్తారు. స్టెల్త్ టెక్నాలజీ, ట్విన్ ఇంజిన్, సూపర్ క్రూయిజ్ వంటి అత్యాధునిక సామర్థ్యాలు ఈ యుద్ధ విమానాల ప్రత్యేకత. కేవలం తయారీనే కాకుండా, వాటి టెస్టింగ్ కూడా పుట్టపర్తిలోనే చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 7,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. దీనికి అనుబంధంగా వచ్చే ఇతర పరిశ్రమల ద్వారా మరో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉందని, దీనికోసం ప్రభుత్వం మరో 400 ఎకరాలు కేటాయించింది.పుట్టపర్తి ప్రాజెక్టుతో పాటు, కర్నూలు జిల్లాలో నిర్మిస్తున్న 'డ్రోన్ సిటీ' ద్వారా దేశంలోనే అత్యుత్తమ డ్రోన్ ఎకోసిస్టమ్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. రాయలసీమ, ప్రకాశం జిల్లాల పరిధిలో రక్షణ, డ్రోన్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా ఏఎంసీఏ ప్రాజెక్టుతో పాటు మరో 12 ప్రాజెక్టులకు కూడా శుక్రవారం శంకుస్థాపన జరగనుంది. వీటిలో 4 డిఫెన్స్ ప్రాజెక్టులు కాగా, 8 డ్రోన్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ 12 ప్రాజెక్టుల ద్వారా అదనంగా రూ.4,145 కోట్ల పెట్టుబడులు, 6,071 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

మరో 12 ప్రాజెక్టుల వివరాలు:

కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్: రూ.1430 కోట్ల పెట్టుబడి, 565 మందికి ఉపాధి

భారత్ డైనమిక్స్ లిమిటెడ్: రూ.489 కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉపాధి

హెచ్‌ఎఫ్ సీఎల్: రూ.1040 కోట్ల పెట్టుబడి, 870 మందికి ఉపాధి

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్: రూ.500 కోట్ల పెట్టుబడి, 2050 మందికి ఉపాధి

అల్గోబాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్: రూ.34 కోట్ల పెట్టుబడి, 52 మందికి ఉపాధి

డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్: రూ.255 కోట్ల పెట్టుబడి, 850 మందికి ఉపాధి

డ్రోన్ ల్యాబ్ టెక్నాలజీస్: రూ.5 కోట్ల పెట్టుబడి, 14 మందికి ఉపాధి

హెచ్ సి రోబోటిక్స్: రూ.100 కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉపాధి

సెన్స్ ఇమేజ్ టెక్నాలజీస్: రూ.68 కోట్ల పెట్టుబడి, 45 మందికి ఉపాధి


ఎయిర్ పేస్ ఇండస్ట్రీస్: రూ.100 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉపాధి

జేడీకే ఫ్లై డ్రోన్ వరల్డ్: రూ.114 కోట్ల పెట్టుబడి, 350 మందికి ఉపాధి

లాట్రిక్ ఎయిరో స్పేస్: రూ.10 కోట్ల పెట్టుబడి, 125 మందికి ఉపాధి

ఈ ప్రాజెక్టులు మడకశిర, దొనకొండ, నెల్లూరు, కర్నూలు డ్రోన్ సిటీల్లో ఏర్పాటవుతాయి.ఈ భారీ ప్రాజెక్టులతో రాయలసీమ పారిశ్రామిక ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. సాగునీటి ప్రాజెక్టులతో పాటు ఇలాంటి భారీ పరిశ్రమల ఏర్పాటుతో వెనుకబడిన ప్రాంతమనే ముద్రను చెరిపేసి, 'రక్షణ సీమ'గా సరికొత్త చరిత్రను లిఖించబోతోంది.

# మంత్రి సీతక్కకు కవిత విజ్ఞప్తి



**మొదటిపేజీ తరువాయి -** మంత్రి సీతక్కకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక విజ్ఞప్తి చేశారు. ఆమె శాఖలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలని కోరారు. స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ మేరకు కవిత 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పాటునివ్వాల్సిన స్త్రీనిధి సంస్థ అక్రమార్కులకు అడ్డంగా మారిందని ఆరోపించారు.సంస్థను తన గుప్పెట్లో పెట్టుకుని అనేక అక్రమాలకు కారకుడైన ఎండీ, ఇప్పుడు దొడ్డిదారిన సంస్థకు ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో ఈ నెల 16వ తేదీన స్త్రీనిధి ఉద్యోగుల సమావేశంలో ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పోస్టును తీసుకోవడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని పేర్కొన్నారు.సదరు ఎండీ పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనుందని, దీంతో ఆయన సంస్థను ఎలాగైనా తన అధీనంలోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమార్కులను దొడ్డిదారిలో కీలక పోస్టుల కొనసాగించేందుకు ఎంతకైనా దిగజారుతోందని విమర్శించారు.తన శాఖలో జరుగుతున్న అక్రమాలపై మంత్రి సీతక్క స్పందించాలని కోరారు. స్త్రీ నిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్త్ర నిధిలో నియామకాలు పారదర్శకంగా జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

# కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

## మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్



**మంథని, మే 14(వార్త సంధ్య ) :** మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను అభివృద్ధి చేసేందుకు తన శాయ శక్తుల కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు. వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి తో కలిసి కళాశాలలో జరిగిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జరిగిన పేరెంట్ టీచర్ మీటింగ్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇప్పటికే నిధులు కేటాయించారని, మంత్రి సహాయ సహకారాలతో కళాశాలను మరింతగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఇంత అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్న ఈ కళాశాల విద్యార్థిని ప్రభుత్వ కళాశాలలో జిల్లాలో మొదటి స్థానం సాధించడం అభినందనీయమన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ కళాశాలలో చదివే బదులు అదే స్థాయిలో విద్యనందిస్తున్న ప్రభుత్వ సంస్థను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలోజీ, అధ్యాపకులు రావుల తిరుమల్, శశాంక్ ,శ్రీదేవి, నగేష్,ఎల్ఆర్ కే రెడ్డి, సబిత,మౌనిక,సిబ్బంది బియ్యబాని,అనసూయ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కుమ్మరి వృత్తిదారుల సమస్యలు పరిష్కరిస్తాం

**బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిని కలిసిన కుమ్మరి సంఘం నేతలు**

**మట్టికుంటలు, చెరువుల సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 14 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కుమ్మరి వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిని కుమ్మరి సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా జిల్లాలోని 23 మండలాల్లో కుమ్మరి వృత్తిదారులు ఉపయోగిస్తున్న మట్టికుంటలు, చెరువుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో వృత్తి నిర్వహణకు ఉపయోగించిన మట్టికుంటలు ప్రస్తుతం అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని నాయకులు వివరించారు. ఏ మండలంలో, ఏ గ్రామంలో సమస్యలు ఉన్నాయో పూర్తి వివరాలు అందిస్తే వాటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే కుమ్మరి వృత్తిదారులకు సంబంధించిన ఇతర సమస్యలు కూడా తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి కోరినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మల్లెల ఉషారాణి (న్యాయవాది), జిల్లా అధ్యక్షులు బాడిశ శంకర్రావు, జిల్లా నాయకులు శ్రీనివాస్, నాగేశ్వరావు, చర్ల మండల బాధ్యులు సత్యనారాయణ, అశ్వాపురం మండల బాధ్యులు కృష్ణ, సత్యనారాయణ, హరిబాబు, దమ్మపేట మండల బాధ్యులు శ్రీనివాస్, సుజాతనగర్ మండల బాధ్యులు పుల్లయ్య, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటిడిఏ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**గిరిజన ప్రాంతాలకు మౌలిక వసతులు త్వరగా అందాలి**

**అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే ఆదేశాలు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మేత 14 (వార్త సంధ్య) :** పినపాక నియోజకవర్గ పరిధిలో ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు త్వరితగతిన అందుబాటులోకి వచ్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో ఇంకా అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనుల విషయంలో సంబంధిత శాఖ మంత్రులతో చర్చించి అవసరమైన నిధులు, శాంక్షన్లు మంజూరు చేయించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. చేపడుతున్న పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోపు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుకర్, ఉప ఇంజనీర్ రాజు, సహాయ ఇంజనీర్లు శ్రీకాంత్, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ సభ్యులకు మాస్టర్ హెల్త్ చెకప్:రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ హామీ



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 14:** తెలంగాణ రాష్ట్ర అవతరణ వారోత్సవాల్లో భాగంగా నిమ్స్ లో ప్రెస్ క్లబ్ సభ్యులు అందరికి మాస్టర్ హెల్త్ చెకప్ చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్ విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల,ఉపాధ్యక్షురాలు అరుణ అత్తలూరి సోమవారం నాడు సచివాలయంలో మంత్రి దామోదర్ రాజ నరసింంహా కు ఒక వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా త్వరలోనే నిమ్స్ లో మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహించడానికి అధికారులను ఆదేశించారు. ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ ఈ స్పెషల్ డ్రైవ్ లో మాస్టర్ హెల్త్ చెకప్ ఉచితంగానే చేస్తామని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. జర్నలిస్టులు తమ ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకోసం రెగ్యులర్గా హెల్త్ చెకప్ చేసుకోవాలని మంత్రి సూచించారు. నిమ్స్ లో అవసరమైన ఏర్పాటు చేయాలని దామోదర్ రాజనర్సింహ రాష్ట్రఆరోగ్య విభాగం కార్యదర్శి క్రిస్టినాను ఆదేశించారు. ప్రెస్ క్లబ్ సభ్యులకు మాస్టర్ చెకప్ క్యాంపు క్యాంపు ఏర్పాటుకు అంగీకరించడం పట్ల ప్రెస్ క్లబ్ పాలకమండలి మంత్రికి కృతజ్ఞతలు తెలిపింది.

# మణుగూరు సింగరేణిలో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలా..?

**లిఖితపూర్వక ఆదేశాలు లేకుండానే విలేకరులకు నిర్బంధం**

**జీఎం కార్యాలయంలో జర్నలిస్టు కర్నే బాబురావును అడ్డుకున్న సెక్యూరిటీ**

**"కలం గొంతు నొక్కితే సహించం" అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన పాత్రికేయులు**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 14 (వార్త సంధ్య) :** ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కాలరీస్‌లో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు విధిస్తున్నారన్న ఆరోపణలు మణుగూరులో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మణుగూరు ఏరియా జీఎం కార్యాలయంలో కొందరు అధికారులు అప్రజాస్వామిక ధోరణితో వ్యవహరిస్తూ జర్నలిస్టులను కార్యాలయంలోకి రానీయకుండా అడ్డుకుంటున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. గురువారం ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో పీఏ కార్యాలయంలోని డిస్పాచ్ ఇన్‌వార్డ్ సెక్షన్‌లో ఒక పత్రం అందజేయడానికి వెళ్లిన జర్నలిస్టు కర్నే బాబురావును సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లడం ప్రతి పౌరుడి హక్కు అయినప్పటికీ, సింగరేణి అధికారులు మాత్రం జర్నలిస్టుల పట్ల వివక్ష చూపుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విశేషమేమిటంటే జర్నలిస్టులను అడ్డుకోవాలనే విషయంలో జీఎం కార్యాలయం నుంచి ఎలాంటి లిఖితపూర్వక ఆదేశాలు లేకపోయినా, "ఏజీఎం పర్సనల్ లేదా ఎస్వో నుండి జీఎం అనుమతి ఉంటేనే లోపలికి అనుమతించాలి" అంటూ సెక్యూరిటీ సిబ్బందికి మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. దీంతో పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారనే ఆరోపణలు మరింత బలపడుతున్నాయి. ఈ ఘటనపై జర్నలిస్టు కర్నే బాబురావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "జర్నలిస్టులను అవమానించడం దురదృష్టకరం. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం. ఈ వ్యవహారాన్ని సింగరేణి ఎండీ, డైరెక్టర్ల దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకెళ్తా. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం ఆపను" అని హెచ్చరించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ సంస్థలపై ఉందని, సమాచారాన్ని దాచిపెట్టే ధోరణి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై జర్నలిస్టు సంఘాలు స్పందించి చర్యలు కోరాలని స్థానిక పాత్రికేయులు డిమాండ్ చేస్తున్నారు.

# మీసేవ ద్వారా మరో పోటీ పరీక్ష హాల్ టికెట్లు లభ్యత

**డీఈఈసెట్ హాల్ టికెట్లు రేపటి నుంచి**

**మీ సేవ వాట్సాప్ ద్వారా అందుబాటులోకి**

**తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం, డీఈఈసెట్ ( హాల్ టికెట్లను మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్ లో అందుబాటులోకి తీసుకువచ్చింది.**






**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 14 :** రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు 15 మే 2026 ఉదయం 10:00 గంటల నుంచి వాట్సాప్ ద్వారా తమ హాల్ టికెట్లను వెంటనే పొందవచ్చు. డీఈఈసెట్ పరీక్ష ఈ నెల 21,22 తేదీల్లో జరగనుంది.

మీ సేవ వాట్సాప్ ద్వారా డీఈఈసెట్ హాల్ టికెట్ పొందే విధానం

1. అధికారిక మీ సేవ వాట్సాప్ నంబర్ 8096958096 ను " పేరుతో సేవ్ చేసుకోవాలి.
2. వాట్సాప్ ఓపెన్ చేసి " అని మెసేజ్ పంపాలి.
3. " అని టైప్ చేయాలి.
4. మెనూలో కనిపించే "ఓపెన్ సర్వీస్" ఎంపికపై క్లిక్ చేయాలి.
5. అవసరమైన వివరాలు నమోదు చేయాలి:
6. వివరాలు సమర్పించిన వెంటనే డీఈఈసెట్ హాల్ టికెట్ వాట్సాప్‌లో అందుతుంది.

ఈ సేవ ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు పరీక్షలకు సంబంధించిన సేవలు వేగంగా, పారదర్శకంగా అందుబాటులోకి వస్తాయి. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకంగా, సులభమైన డిజిటల్ సేవలను అందించాలనే లక్ష్యంతో, ఐటీ & కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో మీ సేవ ద్వారా పౌర సేవలను మరింతగా విస్తరిస్తూ ముందుకు సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన డిజిటల్ సేవల వేదిక అయిన మీ సేవ, 18 నవంబర్ 2025న ప్రారంభించిన మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్ సేవల ద్వారా ప్రజలకు మరింత సులభంగా ప్రభుత్వ సేవలను అందిస్తోంది.

**ప్రారంభం నుంచి విశేష ఆదరణ**

18 నవంబర్ 2025న ప్రారంభమైన మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్ సేవలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే ఈ వేదిక తెలంగాణలో అత్యంత వేగంగా ప్రజాదరణ పొందిన డిజిటల్ పౌర సేవా వేదికలలో ఒకటిగా నిలిచింది.

**అత్యధికంగా వినియోగిస్తున్న సేవలు:**

జనన ధృవపత్రం
ఆదాయ ధృవపత్రం
పోలీస్ చలాన్ సేవలు
విద్యుత్ బిల్లు సేవలు
బీఐఈ ఫలితాల సేవలు

వాట్సాప్ ఆధారిత ప్రభుత్వ సేవలపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం, మీ సేవ వేదికల ద్వారా మరిన్ని డిజిటల్ సేవలను విస్తరించేందుకు నిరంతర ప్రయత్నం చేస్తోంది.

జారీచేసినవారు...
కమిషనర్, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ
ఐటీ & కమ్యూనికేషన్స్ శాఖ తెలంగాణ ప్రభుత్వం.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**-ఊషన్నపల్లిలో ఘనంగా బడిబాట కార్యక్రమం**

**- ఊషన్నపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య**





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 14 వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లా కల్వశ్రీరాపూర్ మండలం ఉషన్న పల్లి పాఠశాల పిల్లలకు నిర్మాణాత్మకంగా, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, అది ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమవుతుందని ఊషన్నపల్లి ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అన్నారు. గురువారం ఆయన ఊషన్నపల్లి గ్రామ వీధుల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ప్రాముఖ్యతను, సౌకర్యాలను తెలియజేసే ఫ్లెక్సీ బ్యానర్ తో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. 'ప్రభుత్వ పాఠశాలలు ప్రగతికి సోపానాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువు పిల్లల జీవితాల్లో నింపును వెలుగు' అంటూ గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఈర్ల సమ్మయ్య గ్రామంలోని హనుమాన్ దేవాలయం చావడి వద్ద గ్రామస్తులు,పిల్లల తల్లిదండ్రులను సమావేశపరిచారు. గ్రామంలోని బడి ఈడు పిల్లలందరినీ ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని ఆయన కోరారు. ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలో పిల్లల కోసం మినరల్ వాటర్ ప్లాంట్, ఫ్రిడ్జ్, ఇంటరాక్టివ్ ప్యానల్ (స్మార్ట్ టీవీ), ప్రతి గదిలో గోడ గడియారాలు, అద్దాలు, ఏర్పాటు చేశామన్నారు. అతి త్వరలోనే కంప్యూటర్లు, సోలార్ విద్యుత్తుతో పాటు కొత్త తరగతి గదుల్లో ఏసీలు, డిస్క్ బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లలకు కావలసిన మౌలిక, భౌతిక సౌకర్యాలను కల్పించడమే కాకుండా వారికి ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ విద్యను అందిస్తున్నామని, పాఠశాలకు వరుసగా రెండుసార్లు జిల్లా 'బెస్ట్ ఛాంపియన్ స్కూల్' అవార్డు రావడం దీనికి చక్కని నిదర్శనమన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక స్థాయి నుంచి పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నామన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్షలో 5గురు, గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో 7గురు, రాష్ట్రస్థాయి తెలుగు పద్యాల పోటీలో ఇద్దరు పిల్లలు అత్యంత ప్రతిభ కనబరిచి విజయం సాధించారన్నారు. పిల్లలకు ప్రతిరోజు పాలు, టిఫిన్ తో పాటు రుచి, శుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, నూతనంగా 21 వస్తువులతో కూడిన విద్యా సామగ్రి కిట్ ను ప్రతి పిల్లవానికి అందజేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలందరినీ ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే చేర్పించాలని ఈర్ల సమ్మయ్య కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్యతో పాటు గంగారం హైస్కూల్ టీచర్ జి. రవి, ప్రీ ప్రైమరీ పాఠశాల టీచర్, ఆయాలు శ్రీవాణి, స్రవంతి, విద్యార్థినీ, విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు, పలువురు పాల్గొన్నారు.

# ధాన్యం లిఫ్టింగ్‌లో జాప్యం లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా నిర్వహించాలి**

**కొనుగోలు కేంద్రాల్లో పెండింగ్ నిల్వలు లేకుండా చూడాలి**

**అదనపు లారీలను వెంటనే ఏర్పాటు చేయాలి**

**డీసీఎంలు, అవసరమైతే ఇసుక రవాణా వాహనాలను కూడా ధాన్యం రవాణాకు వినియోగించాలి**

**సమీప మిల్లులకు ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యం తరలింపు చేపట్టాలి**

**పెద్దపల్లి మండలం రంగాపూర్ ఐజి గోదాములు, మంథని మండలం పుట్టపాక ఐకెపి కేంద్రం, మంథని మార్కెట్ యార్డును పరిశీలించిన జిల్లా కలెక్టర్**









**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మంథని, మే 14(వార్త సంధ్య) :** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, లిఫ్టింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని ఐజి గోదాములను,మంథని మండలం పుట్టపాక గ్రామంలోని ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని , మంథని మార్కెట్ యార్డు సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వలు, లిఫ్టింగ్ పరిస్థితులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మంథని మార్కెట్ యార్డు మాట్లాడుతూ,నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద వేగవంతంగా కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కువకాలం కేంద్రాల వద్ద నిల్వ ఉంచకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం స్టాక్ పెండింగ్‌లో లేకుండా చూడాలని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 70 లారీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని,అదనంగా మరో 30 నుంచి 40 లారీలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆర్టీఓ శాఖ,రవాణా ఏజెన్సీలకు సూచించారు. డీసీఎం వాహనాలను కూడా ధాన్యం రవాణాకు మళ్లించాలని ఆదేశించారు. అవసరమైతే కొద్ది రోజులపాటు ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను కూడా ధాన్యం రవాణాకు వినియోగించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రానికి సమీపంలోనే రైస్ మిల్లులు ఉన్నచో ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా, లిఫ్టింగ్ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. అనంతరం మంథని మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు (దొంతులవాడ)లో జరుగుతున్న సెన్సెస్ (జనాభా లెక్కల) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. తరువాత మంథని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వ హించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, సయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్,తదితరులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



## బంజారాహిల్స్ కొమురంభీం భవన్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ గురుకులాలు సంక్షేమ హాస్టల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 14 :** ముఖ్య అతిథిగా హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరి.. కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు , బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి. వెంకటేశ్వర్లు, రాజ్య సభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి , ఎంజేపి సెక్రటరీ సైదులు, బీసీ కమిషన్ సభ్యులు,బీసీ సంక్షేమ శాఖ అధికారులు కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి కామెంట్స్.. "విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతాం"అంటే విద్య వినయాన్ని ఇస్తుంది, వినయం వ్యక్తిని గొప్పవాడిని చేస్తుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. విద్య ప్రపంచాన్ని మార్చడమే కాకుండా, బానిసత్వం నుంచి బయటకు తీసుకు వస్తుందని నెల్సన్ మండేలా, మహాత్మా జ్యోతిరావు పూలే లు చెప్పారు . తెలంగాణ రైజింగ్ లో ప్రతి విద్యార్థి భాగం కావాలి. విద్య ఎవరి సొత్తు కాదు సరస్వతి దేవికి రంగు, రూపు తేడా ఉండదు. విద్యపై మనం చూపే ఏకాగ్రతే మనల్ని ముందుకు నడిపిస్తుంది. గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం కనుక 100% ఉత్తీర్ణత సాధించాలి. అన్ని రంగాల్లో బీసీలు ముందుండాలి. 100 సంవత్సరాలుగా చేయని కుల గణన ను ప్రజా ప్రభుత్వం చేసింది. విద్యలో ఒత్తిడి ఉండొద్దని 25 వేల మంది టీచర్లకు బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చాం అవకాశాన్ని సృష్టించుకున్నవాళ్లే సమర్థులు అవుతారు. రాజకీయాలు అనగానే ఒక ధోరణి ని విడనాడాలి. భవిష్యత్ లో అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికై చట్టాలు చేయాలి. రాజకీయ నాయకులు చేసే చట్టాలు దేశ భవిష్యత్తును మారుస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగం విప్లవాత్మకంగా మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వం విద్యార్థుల కోసం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

## వ్యవసాయ అవసరాలకే చెరువు మట్టిని వినియోగించాలి...

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**రేపటి నుంచి సంబంధిత తహసీల్దార్‌కు రైతులు దరఖాస్తు చేసుకోవాలి**

**రైతులకు ఉచితంగా సారవంతమైన చెరువు మట్టి అందజేత**

**చెరువు మట్టిని ఇతర అవసరాలకు మళ్లిస్తే కఠిన చర్యలు**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 14( వార్త సంధ్య) :** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువులలోని సారవంతమైన చెరువు మట్టిని తమ వ్యవసాయ భూములకు తరలించేందుకు ఆసక్తి గల రైతులు రేపటి నుంచి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీరు లేని చెరువుల నుంచి చెరువు మట్టిని వ్యవసాయ భూములకు తరలించుకోవడానికి అనుమతులు మంజూరు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులో రైతు వివరాలు, భూమి విస్తీర్ణం, పీపీబీ వివరాలు, రవాణా వాహనం వివరాలు, వాహన నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. సంబంధిత తహసీల్దార్ దరఖాస్తులను పరిశీలించి అనుమతులు జారీ చేస్తారని, అనంతరం రైతులు చెరువుల నుంచి చెరువు మట్టిని తరలించుకోవచ్చని కలెక్టర్ వివరించారు. రైతులకు ఈ సారవంతమైన చెరువు మట్టిని పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ చెరువు మట్టిని కేవలం వ్యవసాయ అవసరాలకే వినియోగించాలని స్పష్టం చేశారు. చెరువు మట్టిని ఇతర అవసరాలకు మళ్లించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించి, కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన ఎంపీఓ



**మంథని, మే 14(వార్త సంధ్య) :** మంథని మండలం గుంజపడగు గ్రామంలో పారిశుధ్య పనులు పర్యవేక్షించిన ఎంపీవో షబ్బీర్. వర్షాకాలం లోపు పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండెవెన సంధ్య బానేష్ మరియు కార్యదర్శి సరస్వతి పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు: సిట్ ఎదుట హాజరు కానున్న డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 14 (వార్త సంధ్య):** గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతిపక్ష నేతల ఫోన్లు అక్రమంగా ట్యాప్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో భాగంగా కామారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్‌కు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని సైబర్ టవర్స్‌లో ఉన్న సిట్ కార్యాలయంలో హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. నోటీసుల మేరకు గంప ప్రసాద్ విచారణకు హాజరుకానున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టుల ఫోన్లు అక్రమంగా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వెలువడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి కేసును లోతుగా విచారిస్తోంది. ఇప్పటికే పలువురు కీలక నేతలను సిట్ అధికారులు ప్రశ్నించగా, వివిధ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ నాయకుల నుండి కూడా వివరాలు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగానే కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకుడు గంప ప్రసాద్‌ను విచారణకు పిలిచినట్లు సమాచారం. ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలు, ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన అంశాలపై గంప ప్రసాద్ వాంగ్మూలాన్ని సిట్ అధికారులు నమోదు చేయనున్నట్లు తెలిసింది. ఈ మేరకు కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, చాట్ల రాజేశ్వర్, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, లక్కపత్తిని గంగాధర్, వడ్ల సురేష్, టింకు భరత్ తదితరుల ఆధ్వర్యంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు.

## ఆర్ అండ్ బీ శాఖ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పనుల అమలులో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి**

**టెండర్ దశలో ఉన్న పనులను త్వరితగతిన ఖరారు చేయాలి**

**ఐడీఓసీలో ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 14(వార్త సంధ్య) :** జిల్లాలో ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువుల్లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,జిల్లాలో కొనసాగుతున్న రహదారులు, భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల అమలులో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనులు నిర్వహించాలని తెలిపారు.టెండర్ దశలో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. టెండర్ల ఖరారులో జాప్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగరేణి అవసరాల కోసం భూసేకరణ జరుగుతున్న కొన్ని గ్రామాల్లో అవసరం లేని రహదారి విస్తరణ పనులను ప్రోత్సహించవద్దని తెలిపారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని సూచించారు.మెడికల్ కళాశాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత శాఖకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంథని గెస్ట్ హౌస్ నిర్మాణ పనులను నిర్దేశిత 9 నెలల గడువులో పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రహదారుల మరమ్మతు పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని తెలిపారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెండింగ్ బిల్లులు, భూసేకరణ, విద్యుత్ లైన్ మార్పిడి వంటి సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని త్వరగా పరిష్కరించాలని సూచించారు. అభివృద్ధి పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, వారంవారీగా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ భావ్ సింగ్, సీపీఓ రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఫరీద్‌పేట్‌లో బాడీ మీటింగ్ బహిష్కరణ

**సర్పంచ్ నర్సింహారెడ్డిపై వార్డు సభ్యుల తిరుగుబాటు**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 14 (వార్త సంధ్య):** కామారెడ్డి జిల్లా ఫరీద్‌పేట్ గ్రామ పంచాయతీ బాడీ మీటింగ్ తీవ్ర ఉద్రిక్తతల మధ్య జరిగింది. గ్రామ నిధుల వినియోగంలో పారదర్శకత లేదని ఆరోపిస్తూ వార్డు సభ్యులు తగిరంచ రమాదేవి, దేవోల్ల ప్రత్యూష, జ్యోతి, వెంకట్ స్వామి గౌడ్, నర్సింలు సమావేశాన్ని మధ్యలోనే బహిష్కరించారు. బాడీ తీర్మానం లేకుండా, వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా భారీ మొత్తంలో బిల్లులు తీసుకున్నారని సభ్యులు ఆరోపించారు. కేవలం నాలుగు నెలల్లోనే సుమారు రూ.11 లక్షల వరకు బిల్లులు తీసుకున్నారని, అయితే పాత పెండింగ్ బిల్లులు ఇప్పటికీ క్లియర్ చేయలేదని మండిపడ్డారు. సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ, "వార్డు సభ్యులకు తెలియజేయకుండా, తీర్మానం లేకుండా డబ్బులు ఎలా తీసుకున్నారు? ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి ఎందుకు తీసుకొచ్చారు?" అంటూ సర్పంచ్ జీడిపల్లి నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్‌ను నిలదీశారు. అయితే సరైన సమాధానాలు రాకపోవడంతో సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2026లో తీసుకున్న బిల్లులకు 2023, 2024 సంవత్సరాలకు చెందిన జియో ట్యాగ్ ఫోటోలు ఎందుకు జత చేశారని, పాత పనులను కొత్త పనులుగా చూపించారా? అంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, "మేము పాత బకాయిలు చెల్లించాలని కోరినప్పుడు, 'నేను రూ.30 లక్షలు ఖర్చు పెట్టి గెలిచానుడ అందరికీ ఇస్తూ పోతే నాకు ఏమి మిగులుతుంది' అని సర్పంచ్ మాట్లాడటం మాకు తీవ్ర బాధ కలిగించింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయానికి వెళ్లినప్పుడు వార్డు సభ్యుల ఫోన్లు తీసుకుని పక్కన పెట్టి, తర్వాత మాట్లాడండి అని చెప్పడం ప్రజాప్రతినిధులను అవమానించే విధంగా ఉందని ఆరోపించారు. పాత బకాయిలు ఇంకా చెల్లించకపోయినా, ఎంపిక చేసిన కొంతమందికే బిల్లులు క్లియర్ చేస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. మీడియాతో మాట్లాడిన వార్డు సభ్యులు, "గ్రామ ప్రజలు మమ్మల్ని నమ్మి గెలిపించారు. కానీ ఇప్పుడు గ్రామంలో జరుగుతున్న ఆర్థిక వ్యవహారాలు చూసి ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి వచ్చింది. గ్రామ ప్రజల డబ్బుపై స్పష్టత లేకపోవడం బాధాకరం" అని పేర్కొన్నారు. సర్పంచ్ నర్సింహారెడ్డి గతంలో బీఆర్ఎస్ పార్టీలో వైస్ ఎంపీపీగా, ఇన్‌చార్జ్ ఎంపీపీగా పనిచేసిన సమయంలో కూడా ఇలాంటి ఆరోపణలు రావడం ప్రస్తుతం గ్రామంలో చర్చనీయాంశంగా మారిందని తెలిపారు. ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి, వార్డు సభ్యులను పట్టించుకోకుండా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడుతూ, అవసరమైతే తదుపరి రాజకీయ నిర్ణయాలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు.

## రాజంపేట ఎస్‌బీఐలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 14 (వార్త సంధ్య):** రాజంపేట మండలంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) శాఖలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, వేసవి కాల జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్రీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు, రాజంపేట సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీ బి. మహేష్ సూచనలతో పోలీస్ కళాబృందం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దని, బ్యాంకు అధికారులు లేదా పోలీస్ అధికారులు కూడా ఓటీపీలు అడగరని వివరించారు. సైబర్ నేరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేయాలని, మహిళల భద్రత కోసం షీ టీమ్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్ నంబర్ 972686094ను వినియోగించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కూడా సూచించారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుళ్లు రామంచ తిరుపతి, శేషరావు, పీసీలు ప్రభాకర్, సాయిలు పాటలు, మాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్ గౌడ్, లింగంపేట హెడ్ కానిస్టేబుల్ రమేష్, కామారెడ్డి షీ టీమ్ సభ్యురాలు పీసీ భాను రెడ్డి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన బ్యాంకు వినియోగదారులు పాల్గొన్నారు.

## మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**అధ్యక్షునిగా కొడారి మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మహావాది సతీష్ కుమార్**





**మంథని, మే 14(వార్త సంధ్య) :** మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా కొడారి మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మహావాది సతీష్ కుమార్, గౌరవాధ్యక్షులుగా బొల్లవరం విజయానందరావు, ఉపాధ్యక్షులుగా జబ్బార్ ఖాన్, వెల్మ రెడ్డి శ్రీనివాస రెడ్డి, కోశాధికారిగా చేరాల రవీందర్, సహాయ కార్యదర్శులుగా చిప్ప రాజేష్, గిరివేణి రాకేష్, ప్రచార కార్యదర్శి చెలుకల యుగంధర్, కార్యవర్గ సభ్యులుగా కాశీపేట శ్రీకాంత్, నాంపల్లి శ్రీనివాస్, మాదేశి శ్రావణ్, ఆకుల రాజు, రామడుగు సాయి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కొడారి మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహావాది సతీష్ కుమార్ మాట్లాడుతూ సంవత్సర కాలంలో ఏర్పాటై అంచెలంచెలుగా ఎదుగుతున్న డివిజన్ ప్రెస్ క్లబ్ ఇదే స్థాయిలో మంథని, కమాన్ పూర్, ముత్తారం మండలాల స్థాయిలో గొప్ప పేరుతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సీనియర్ పాత్రికేయులు అక్కల నారాయణ మాట్లాడుతూ నూతన కమిటీ పాత్రికేయులకు స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సంవత్సర కాలం క్రితం ఏర్పాటైన మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ అందరి సభ్యుల కృషితో ముందుకు సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఒక సంవత్సరం సమయంలో కొన్ని పొరపాట్లు జరిగినా వాటిని అధిగమించి, ఇంతకు ముందు జరిగిన అటు పోట్లు తట్టుకొని జరిగిన పొరపాట్లు మళ్ళీ జరుగకుండా మెజారిటీ సభ్యుల అభిప్రాయాల మేరకు క్లబ్ సభ్యుల సంక్షేమం కోసం పాటు పడతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్య వర్గాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు మెడగొని రాజమౌళి గౌడ్, మల్యాల దేవేందర్, అనుము వీర స్వామి, ఎగోలపు సంతోష్ గౌడ్, అమ్ము శ్రీనివాస్, కాసర్ల శంకర్, ఎండీ. సుభాన్, రావుల రాజ్ కుమార్, మంథని లక్ష్మణ్, మాటేటి కుమార్, సడవలి, కాసు తిరుపతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన-2027 ఇంటి గణనపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 14 (వార్త సంధ్య):** జనగణన-2027లో భాగంగా తొలి దశలో చేపడుతున్న ఇంటి గణన, ఇంటి జాబితా తయారీ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి ఆశిష్ సాంగ్వాన్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లాలోని తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), మున్సిపల్ కమిషనర్లకు పలు సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నియమించబడిన ఎన్యూమరేటర్లు అందరూ తమకు కేటాయించిన హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ (హెచ్‌ఎల్‌బీ) పరిధిలో హెచ్‌ఎల్‌ఓ యాప్ ద్వారా వివరాలను నమోదు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు ఎన్యూమరేటర్లకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో టామ్‌టామ్, శానిటేషన్ వాహనాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉదయం లేదా సాయంత్రం వేళల్లో వివరాల సేకరణ చేపట్టాలని తెలిపారు. జనగణనలో భాగంగా ప్రజలు ఎన్యూమరేటర్లకు సరైన సమాచారాన్ని అందించి, దేశ అభివృద్ధికి అవసరమైన గణాంకాల సేకరణలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కోరారు.

## ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి సీపీఐ భరోసా

**ఎమ్మెల్యే సహకారంతో నూతన భవనానికి నిధులు సమీకరిస్తాం**

**కళాశాల భూముల పరిరక్షణ, బాలికల హాస్టల్ ఏర్పాటుకు కృషి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 14 (వార్త సంధ్య) :** ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో కళాశాల నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా తెలిపారు. స్థానిక శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. పూర్ణచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన పూర్వ విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ కళాశాల భూములు అన్యాక్రాంతం కాకుండా పకడ్బందీగా పరిరక్షిస్తామని అన్నారు. ప్రస్తుతం ఉన్న భవనాలను విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా తరగతి గదులుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. యూజీసీ నిధులతో నిర్మించిన భవనాన్ని బాలికల హాస్టల్‌గా వినియోగించుకునేందుకు అవసరమైన అనుమతులు తక్షణమే పొందేలా కృషి చేస్తామని చెప్పారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవలు అభినందనీయమని, వారి సహకారం భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు సందీప్, కార్యదర్శి కాసుల వెంకట్, సీపీఓ సంజీవరావు, ప్రముఖ న్యాయవాది రబ్, రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ ప్రసన్న కుమార్, డాక్టర్ ఉమామహేశ్వరరావు, రామస్వామి, పాత్రికేయులు నాగాచారి, లోగాని శ్రీనివాస్, తారకరామారావు, రాజేష్, రవి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు అంధకారం

**విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**ఎన్టీఏ వైఫల్యాలకు బాధ్యత వహించాలి జిల్లా ఏఐఎస్ఎఫ్ డిమాండ్**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 14 (వార్త సంధ్య) :** నీట్-2026 పేపర్ లీకేజీ ఘటన కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై జరిగిన దాడి అని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం రుద్రంపూర్లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నీట్ పరీక్ష పత్రాలు వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా లీక్ కావడం విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివే పేద, మధ్యతరగతి విద్యార్థుల కలలను విద్యా మాఫియా ఛిద్రం చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ కుంభకోణంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్టీఏ (టీమా)లో ఉన్న లోపాలను సవరించి, పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమి సంజయ్, నవీన్, మహేష్, సంతోష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లోకి భారీ వలసలు

**మునిగేపల్లి సర్పంచ్ గంగా స్రవంతితో పాటు 50 కుటుంబాల చేరిక**

**అభివృద్ధి, సంక్షేమ పథకాలకే ఆకర్షితులమంటూ వెల్లడి**



**ఖమ్మం జిల్లా బ్యూరో, మే 14 (వార్త సంధ్య) :** పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీలోకి వలసలు ఊపందుకున్నాయి. మునిగేపల్లి గ్రామ సర్పంచ్ గంగా స్రవంతి తన అనుచర వర్గంతో కలిసి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమక్షంలో గంగా స్రవంతి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఆమెతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన ఐదుగురు వార్డు సభ్యులు, గ్రామ ముఖ్య నాయకులు, వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాల సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఐదు నెలల క్రితం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సర్పంచ్‌గా గెలిచిన గంగా స్రవంతి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా అటవీ అభివృద్ధి సంస్థ ఆవిర్భావ వేడుకలు

**1442వ మొక్కను నాటిన ప్రకృతి ప్రేమికుడు విశ్వామిత్ర చౌహాన్**

**పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య**

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 14 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాల్వంచ అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ మాధవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ పోదెం వీరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డివిజనల్ మేనేజర్ మాధవి ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొన్న ప్రకృతి ప్రేమికుడు విశ్వామిత్ర చౌహాన్ చైర్మన్ పోదెం వీరయ్యతో కలిసి తన 1442వ మొక్కను నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో మొక్కల ప్రాధాన్యతను వివరించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం అటవీ అభివృద్ధి సంస్థ సిబ్బందికి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న హరిత కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ఎఫ్‌డీఓ దామోదర్ రెడ్డి, కొత్తగూడెం డివిజనల్ మేనేజర్ విజయభారతి, అటవీ శాఖ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బి.సి సంక్షేమ ప్రభుత్వ సలహాదారు వీహెచ్‌కు ఘన సన్మానం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బి.సి సంక్షేమ, అభివృద్ధి శాఖ సలహాదారుగా (మంత్రివర్గ హోదాలో) నియమితులైన మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు (వీహెచ్)ను రాష్ట్ర బి.సి నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో బి.సి నాయకులు తెల్ల హరికృష్ణ, పోతుల రాజేందర్ పటేల్, రాకేష్ పటేల్, మరియు నరేందర్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్, బి.సి నాయకులు తెల్ల హరికృష్ణ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా బి.సి సమాజ హక్కుల కోసం, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడుతున్న హనుమంతరావు అనుభవం ఈ కొత్త బాధ్యతతో రాష్ట్రంలోని బి.సిల అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని ఆకాంక్షించారు. ఆయన సలహాలు, సేవలు తెలంగాణ బి.సిల ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లేందుకు దోహదపడతాయని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## బసవరాజు శ్రీనివాస్ ని సన్మానించిన బీ.ఎన్.రెడ్డి మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 14:** తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్ గా బసవరాజు శ్రీనివాస్ నూతనంగా నియమితులైన సందర్భంగా బండ్లగూడలోని వసంత విహార్ ఫంక్షన్ హాల్ నందు ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి ప్రమాణస్వీకార మహోత్సవం వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్ది శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బి.ఎన్.రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్, ఎల్బీనగర్ యువ నాయకులు ముద్దగౌని మనీష్ గౌడ్ మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. తదుపరి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ నూతన చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేయుచున్న బసవరాజ్ శ్రీనివాస్ ని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

## డార్క్ స్టోన్ ఐస్‌క్రీమ్ నూతన బ్రాంచ్ ప్రారంభం




**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 14:** నగరంలో ఆహార ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటున్న డార్క్ స్టోన్ ఐస్‌క్రీమ్ తన 5వ బ్రాంచ్‌ను హస్తినాపురం బీ.ఎన్.రెడ్డి నగర్ జెడ్‌పీ రోడ్‌లో ఘనంగా ప్రారంభించింది. నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రియాంక రెడ్డి, శృతి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన రుచులతో పాటు ప్రత్యేకమైన ఐస్‌క్రీమ్ వెరైటీలను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కుటుంబ సమేతంగా వచ్చి ఆనందంగా గడిపే విధంగా బ్రాంచ్‌ను తీర్చిదిద్దామని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీకాంత్‌తో పాటు పలువురు అతిథులు, స్థానికులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన బ్రాంచ్ ప్రారంభంతో స్థానిక ప్రజలకు మరిన్ని రుచులు అందుబాటులోకి వచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు.

## ఏవీఎస్ ప్లే జోన్ నూతన బ్రాంచ్ ప్రారంభం



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 14:** పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి ఆట స్థలాలు ఎంతో అవసరం చంపాపేట్ ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన "ఏవీఎస్ ప్లే జోన్" బ్రాంచ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, రాజ్యసభ సభ్యులు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య హాజరై నిర్వాహకులతో కలిసి ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి ఆట స్థలాలు ఎంతో అవసరమని తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ప్లే జోన్ పిల్లలకు వినోదంతో పాటు సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సమాజంలో చిన్నారుల కోసం ఇలాంటి కేంద్రాలు మరింత అవసరమని అభిప్రాయపడ్డారు. అనంతరం నిర్వాహకులు అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రంగు రంగుల అవతారాలతో వస్తే ప్రజలు నమ్మరు

**పదేళ్లు రైతులను గోస పెట్టారు**

**ఇప్పుడు 'సోల్లు' పురాణమా..?**

**నాడు సంకెళ్లు వేశారు**

**నేడు కపట ప్రేమ చూపుతున్నారు**

**బిఆర్ఎస్ ప్రభుత్వం పై మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు**





**ఖమ్మం జిల్లా బ్యూరో, మే 14 (వార్త సంధ్య) :** పదేళ్ల అధికార దాహంలో పేదవాడిని విస్మరించి, నాడు రైతుల చేతులకు సంకెళ్లు వేసిన వారు.. నేడు రంగు రంగుల అవతారాలతో వస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో జరిగిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' క్లస్టర్-1 సమావేశంలో



ఆయన ముఖ్యాతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతిపక్షాల తీరును ఎండగడుతూ.. నాడు అధికారంలో ఉండి వరి వేస్తే ఉరి అని రైతులను భయపెట్టిన దొరవారు, నేడు రైతుల కోసం పోరాడుతున్నామంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. దోసెల్లో మొక్కలు పెట్టుకుని, కుండలకు పూతలు పూస్తూ ఫోటోలకు ఫోజులిస్తే ప్రజలు మోసపోరు. మీ పదేళ్ల పాలనలో అధికారులు ఏనాడూ పేదల వద్దకు రాలేదు, కానీ ఈనాడు మేమే స్వయంగా ప్రజల గడప వద్దకు వచ్చి అప్లికేషన్లు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు ఒంటి నిండా విషాన్ని నింపుకొని రోడ్ల వెంట విషం కక్కుతున్నాయని మంత్రి గారు మండిపడ్డారు. మూడు నాలుగు సార్లు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మీకు జ్ఞానం రాలేదు. కుట్రలు, కుతంత్రాలతో ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూస్తే మీ కన్న కలలు కలలుగానే మిగిలిపోతాయని బీఆర్ఎస్ ను ఉద్దేశించి అన్నారు. ప్రజా దీవెనలు ఉన్నంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ ఏమీ చేయలేరన్నారు. హెచ్చరించారు. సోల్లు పురాణం చెప్పే ప్రభుత్వం మాది కాదు.. చేతల ప్రభుత్వం. ఇప్పటికే 73 వేల ఉద్యోగాలు ఇచ్చాం. నిరుద్యోగులకు త్వరలోనే మరిన్ని శుభవార్తలు చెబుతాం. గత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కాగితాలకే పరిమితం చేస్తే, మేము ఒక్క రూపాయి అవినీతి లేకుండా 5 లక్షల ఆర్థిక సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర గారు, అడిషనల్ కలెక్టర్ శ్రీజ గారు, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి గారు, చైర్మన్ పోకబత్తిని అనిత గారు, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ గారు, 15 వార్డుల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో పిడమర్తి రవి కి సముచిత స్థానం కల్పించండి: ఓయు జేఏసీ

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 14 :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధకులు, ఓయూ జేఏసీ మాజీ చైర్మన్ బిఎస్ఎఫ్ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి కి ప్రజా ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ నాయకులు రేవంత్ రెడ్డి సర్కారుకు విజ్ఞప్తి చేశారు. బి ఎస్ ఎఫ్ వ్యవస్థాపకులు,ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పిడమర్తి రవి జన్మదినాన్ని పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో బి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలోలి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కోసం ఎన్నో ఉద్యమాలకు, ఎన్నో త్యాగాలకు మూల కారణం అయినటువంటి డాక్టర్ పిడమర్తి రవి కి ప్రజా ప్రభుత్వంలో సముచిత స్థానం లేకపోవడం సమస్త తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు అవమానకరమని అలాంటి ఉద్యమ నాయకులను గౌరవించుకొని వారికి ప్రజా ప్రభుత్వంలో సముచిత



స్థానం కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బి బి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్లి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీహార్ ఇతర ఉత్తర భారత దేశ వ్యూహకర్తలు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం రావడానికి ప్రణాళికలు చేయాల్సిన అవసరం లేదని కేవలం ఈ రాష్ట్ర అస్తిత్వం తెలిసినా పిడమర్తి రవి కి తెలంగాణ రాష్ట్ర వ్యూహకర్తగా, ప్రభుత్వ భాగస్వామిగా నియమించుకుంటే ఏ పార్టీ అయినా అధికారంలోకి వస్తుందని అన్నారు. పిడమర్తి రవి ఆలోచన విధానం తెలంగాణ రాష్ట్ర అస్తిత్వం అని అలాంటి రవన్న గారికి ప్రజా ప్రభుత్వంలో చోటు లేకపోవడం బాధాకరమని అన్నారు. మరో రెండు దశాబ్దాలు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉండాలంటే పిడమర్తి రవి కి సముచిత స్థానం కల్పించాలని అన్నారు.కార్యక్రమం లో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మొగిలిగిద్ద ప్రసాద్, ఓయు అధ్యక్షులు కల్వకుర్తి శ్రీశైలం,జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి, ఓయూ ఉపాధ్యక్షులు ఆరెకంటి శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల మధు యాదవ్, విద్యార్థి సంఘము అధ్యక్షులు చేరాల వంశీ, ఓయూ అధికారులు నాయకులు, ఆవుల శ్రీధర్, సురేందర్, ఫోరమ్ అధ్యక్షులు అశ్వన్,ఓయూ విద్యార్థి నాయకులు ప్రభాకర్, భాను ప్రసాద్, సత్తి గల్ల సతీష్,తదితరులు పాల్గొన్నారు

## హైదరాబాద్‌లో ఘనంగా తెలంగాణా బిగ్గెస్ట్ ఎడ్యుకేషన్ ఫెయిర్

**ఎల్బీనగర్ ప్రతినిధి, మే 14 (వార్త సంధ్య):** వేలాది మంది విద్యార్థులకు కెరీర్ మార్గదర్శకంగా నిలవనున్న విద్యా మహోత్సవం విశ్వంబర . హైదరాబాద్.విద్యార్థుల భవిష్యత్తుకు సరైన దిశానిర్దేశం చేయాలనే లక్ష్యంతో హైదరాబాద్ నగరంలో "తెలంగాణా బిగ్గెస్ట్ ఎడ్యుకేషన్ ఫెయిర్" ఘనంగా నిర్వహించబడుతోంది. తెలంగాణ విద్యాసమితి ఆధ్వర్యంలో, ప్రముఖ విద్యా సేవకుడు మరియు ఆర్గనైజర్ తారక్ గౌడ్ నాయకత్వంలో జరుగుతున్న ఈ మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్ విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు విద్యాసంస్థల మధ్య ఒక అద్భుతమైన వేదికగా నిలవనుంది. హైదరాబాద్ ఉప్పల్ శిల్పారామంలో నిర్వహించబడుతున్న ఈ భారీ విద్యా ప్రదర్శనలో రాష్ట్రం నలుమూలల నుండి వేలాది మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో దేశంలోని ప్రముఖ యూనివర్సిటీలు, కాలేజీలు, విద్యాసంస్థలు పాల్గొని విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు, అడ్మిషన్ గైడెన్స్, కెరీర్ కౌన్సెలింగ్ మరియు స్కాలర్‌షిప్ వివరాలను అందించనున్నాయి. ముఖ్యంగా దీ.ఎవఎష్ట్ర, ూాఅటవ ూాఇఅవఅఎవం, ూాస్త్రతీఅఎబశ్రీబతీవ & దీ.ూాఎ జశీబతీంవం, ఝఖ, నశేవశ్రీ మీఖఞఖస్త్రవఎవత్, ఎఖీశ, జూా, దీదీూా మరియు




ఐవస్త్రతీవవ ూాఎఅంంఅశీఅం వంటి అనేక కోర్సులపై నిపుణుల ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించేందుకు రూ.100 కోట్లకు పైగా స్కాలర్‌షిప్ అవకాశాలు అందుబాటులో ఉంచడం ఈ ఫెయిర్ ప్రత్యేకతగా నిలుస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఇది గొప్ప వరంగా మారనుందని విద్యా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా ఫెయిర్‌ను సందర్శించే విద్యార్థులకు ప్రత్యేక లక్కీ డ్రా ద్వారా ల్యాప్‌టాప్ గెలుచుకునే అవకాశం కూడా కల్పించారు. ప్రవేశం పూర్తిగా ఉచితం కావడంతో విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని భారీగా వినియోగించుకునే అవకాశం ఉంది. విద్యార్థులకు ఫ్రీ క్యాంపస్ టూర్ సదుపాయం కూడా ఏర్పాటు చేయడం ద్వారా వివిధ యూనివర్సిటీల వాతావరణం, సదుపాయాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ తారక్ గౌడ్ మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకునే దారిలో సరైన మార్గదర్శకత్వం చాలా ముఖ్యమైంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యా అవకాశాలను ఒకే వేదికపై అందించాలనే ఉద్దేశంతో ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నాం. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థుల మధ్య ఉన్న అవగాహన లోటును తగ్గించి, ప్రతి ఒక్కరికీ ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం" అని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు యువత పెద్ద సంఖ్యలో హాజరై ఈ విద్యా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# గోదావరి పుష్కరాలకు భద్రాచలం సిద్ధం కావాలి


**భక్తులకు ఇబ్బందులు లేకుండా ఘన ఏర్పాట్లు చేయాలి**

**అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ఆదేశాలు**

**శానిటేషన్, కరకట్టలు, రోడ్లు, విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 14 (వార్త సంధ్య) :** రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలంలో భారీ స్థాయిలో ఏర్పాట్లు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. దేశ విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకునేందుకు భద్రాచలానికి తరలివస్తారని, అందుకు తగ్గట్టుగా ముందస్తు ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. గురువారం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం వసతి గృహంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోదెం వీరయ్య, ఐటీడీఏ పీవో బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సర్పంచ్ పూణెం కృష్ణతో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి శాఖ అధికారి భద్రాచలం అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భద్రాచలం పట్టణంతో పాటు పరిసర గ్రామాలు, వార్డులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, శానిటేషన్ పరంగా ఎటువంటి లోపాలు లేకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కరకట్ట ప్రాంతాల్లో జూన్, జూలై నెలల్లో నర్సరీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, రోడ్లు, వీధి దీపాలు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణను సమర్థవంతంగా అమలు చేస్తూ తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలని, అక్కడ ఎరువుల తయారీతో పాటు గ్యాస్ ఉత్పత్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రోడ్లపై చెత్త వేస్తే జరిమానాలు విధించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్, దేవస్థానం ఈవో, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, ఫారెస్ట్, టూరిజం శాఖల అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించి గోదావరి పుష్కరాలకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపించాలని మంత్రి ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు వరద ముంపు గ్రామాలను దృష్టిలో పెట్టుకొని షట్టర్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఇప్పటి నుంచే పనులు ప్రారంభించి వేగంగా పూర్తి చేసి పుష్కరాల సమయంలో భక్తులకు, స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్ అండ్ బి సి. నాగేశ్వరరావు, వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ధన్యాల వెంకటేశ్వర్లు, జీపీ ఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# పనివాళ్ల ముసుగులో అరాచకాలు

**ఆందోళన కలిగిస్తోన్న నేపాలీ ముఠాల వరుస దోపిడీలు**

**హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ, నోయిడా వంటి ప్రాంతాల్లో రెక్కీ**

**యూట్యూబ్ వీడియోలు, పాత దోపిడీల అనుభవాలతో నేర పాఠాలు**

**ఆనవాళ్లు దొరక్కుండా సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు పడేస్తున్న వైనం**



ప్రముఖులు, సంపన్నుల కుటుంబాలే వారి లక్ష్యం. ఒక్కసారి ఇంట్లో చేరాక అనుకున్నది సాధించేంత వరకు ఎదురుచూస్తారు. సొత్తుపై కన్నుపడ్డాక రోజులు, నెలలు, ఏళ్లైనా ఓపిక వహిస్తారు. యజమానులు తిట్టినా, జీతం ఇవ్వకున్నా సహనంతో భరిస్తారు. అవకాశం చిక్కగానే ఏ మాత్రం జాలి, దయ లేకుండా అందినకాడికి దోచుకుంటారు. అవసరమైతే ప్రాణాలు తీసేస్తారు. ఇదీ పనివాళ్ల ముసుగులో నేపాలీ ముఠాలు సాగిస్తున్న అరాచకం. వీరి నేర తీరును పోలీసులు విశ్లేషించగా, కీలక విషయాలు బహిర్గతం అయ్యాయి. మొన్న కార్ఖానా, నిన్న జూబ్లీహిల్స్, తాజాగా జవహర్‌నగర్. భాగ్యనగరంలో నేపాలీ పనివాళ్ల వరుస దోపిడీలు ఆందోళన కలిగిస్తున్నాయి. దశాబ్దాలుగా గూర్ఖాలుగా పనిలోకి చేరి, రాత్రిళ్లు పహారా కాస్తూ ఎంతో నమ్మకం పొందిన వీరిలో కొందరు సాగిస్తున్న అఘాయిత్యాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. దోపిడీలకు అడ్డుకట్ట వేసేందుకు రెండ్రోజులుగా నగర శివారు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న నేపాల్ పౌరుల వివరాలు సేకరిస్తున్నారు. పోలీసుల విచారణలో ఈ దోపిడీ ముఠాలు పక్కా పథకం ప్రకారమే ఇళ్లల్లో పనివాళ్లుగా చేరుతున్నట్టు గుర్తించారు. నేపాల్‌లోని సూత్రదారులు, ముంబయి, పుణెలోని దళారుల కనుసన్నల్లో పనివాళ్లుగా చేరి నేరాలకు పాల్పడుతున్నట్టు అంచనాకు వచ్చారు. పనివాళ్ల ముసుగులో ఇంట చేరి, నేపాలీ ముఠాలు సాగించే ఆరాచకాలు ఈ ఏడాది రాజధానిలో ఆరుచోట్ల జరిగాయి. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో అత్యంత కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య ఉండే విశ్రాంత ఐపీఎస్ వినయ్ రంజన్ రే భార్య తనూజను హతమార్చటం సంచలనం రేకెత్తించింది. తాజాగా జవహర్‌నగర్‌లో దంపతులను బంధించి చంపుతామని బెదిరించి, విలువైన సొత్తుతో ఉడాయించారు. ఇలా వరుస ఘటనలతో నేపాలీ పనివాళ్లను పెట్టుకున్న యజమానులు హడలెత్తుతున్నారు. కొందరు తమ నివాసాలు, కార్యాలయాల్లోని నేపాలీ పనివాళ్లను తొలగించినట్టు సమాచారం. నేపాలీ దోపిడీ ముఠాల నేర తీరును పోలీసులు విశ్లేషించగా కీలక విషయాలు బహిర్గతం అయ్యాయి. అడ్డదారిలో డబ్బు సంపాదించేందుకు సిద్ధమైన కొంతమంది నేపాల్ పౌరులు, నాలుగైదు బృందాలుగా ఏర్పడి ఏజెంట్ల ద్వారా భారత్ చేరుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ముందుగా ముంబయి, బెంగళూరులో మకాం వేసి, దళారుల సహకారంతో నకిలీ గుర్తింపు కార్డులు, సిమ్‌కార్డులు పొందుతున్నట్లు తెలిపారు. అలా హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ, నోయిడా వంటి మెట్రో నగరాలకు చేరి సంపన్నులు, ప్రముఖుల నివాస ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తారని తెలిపారు. ఎంపిక చేసుకున్న ఇంటికి వెళ్లి పనివారు కావాలంటే చెప్పండని యజమానులను ఆశ్రయిస్తారు. తక్కువ జీతంతో పని చేస్తామని చెప్పడంతో యజమానులు పనిలోకి చేర్చుకుంటున్నారు. గూర్ఖా, వంట పని, తోట పని, కేర్‌టేకర్‌గా ఉంటూ కుటుంబసభ్యుల కదలికలు, విలువైన వస్తువులు భద్రపరిచే ప్రాంతాలను పరిశీలించి దోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. యజమానులు ఏవైనా వేడుకలకు వెళ్లిన సందర్భాలు, ఒంటరిగా ఉన్న సమయాల్లో ఆహార పదార్థాల్లో మత్తు మందు కలపటం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. నేపాలీ దోపిడీ ముఠాలు యూట్యూబ్ వీడియోలు, పాత నేరస్తుల అనుభవాలతో ముందుగానే నేరపాఠాలు నేర్చుకుంటున్నారు. నేరం చేశాక ఆనవాళ్లు దొరక్కుండా సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు అక్కడే పడేస్తున్నారు. బయటకు వెళ్లాక కొత్త ఫోన్లు తీసుకొని సామాజిక మాధ్యమాల ద్వారా మంతనాలు సాగిస్తూ పోలీసులను ఏమార్చుతున్నారు. ఆపై రైలు, బస్సుల్లో తిరుగుతూ కొట్టేసిన సొత్తును దళారులకు అప్పగించి అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నారు.

# పొదుపు మంత్రం వాహన శ్రేణి కుదింపు

**తగ్గింపు అన్ని స్థాయిల్లోనూ అమలు అయ్యేలా చూడాలన్న సీఎం**

**పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించాలన్న ప్రధాని సూచనతో పొదుపు మంత్రం**

**మోదీ సూచనను పాటిస్తున్న సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్**

**కాన్వాయ్‌లలో వాహనాలను కుదించాలని నిర్ణయం**



ఇరాన్ అమెరికా మధ్య యుద్ధ పరిణామాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ప్రత్యేక్షంగానో పరోక్షంగానో భారత దేశం పైన కూడా తీవ్ర ఒత్తిడి పడుతుంది. అయితే పెట్రోల్ డీజిల్ వినియోగాన్ని తగ్గించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచనను ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వీకరించారు. పొదుపు చర్యలను తామే స్వయంగా ఆచరించి చూపాలని వారు నిర్ణయించుకున్నారు. తత్ఫలితంగా, తమతమ కాన్వాయ్‌లలోని వాహనాల సంఖ్యను తగ్గించుకోవాలని వారు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మోదీ మంత్రాన్ని పాటిస్తున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి : పశ్చిమ ఆసియాలో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో దేశ పౌరులు పొదుపు చర్యలను పాటించాలని సూచించిన ప్రధానమంత్రి మోదీ తానే స్వయంగా ఆ చర్యలను ఆచరిస్తున్నారు. ఇదే స్ఫూర్తిని రాష్ట్రంలోనూ కొనసాగించాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సంకల్పించారు. ఈ లక్ష్యానికి అనుగుణంగా జిల్లా పర్యటనల సమయంలో తన కాన్వాయ్‌లో ఉండే వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా సాధ్యమైనంత తక్కువ సంఖ్యలో వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ 50 శాతం వాహనాల తగ్గింపు నిబంధనను అన్ని స్థాయిలలోనూ కచ్చితంగా అమలు చేయాలని ఆయన నొక్కి చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆలోచనాత్మకంగా వ్యవహరించాలని, దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చే నిర్ణయాలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించుకోవాలని తన భద్రతా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పర్యటనల సమయంలో తన వాహన శ్రేణి పరిమాణాన్ని సగానికి తగ్గించుకోవాలని ఆయన కూడా నిర్ణయించుకున్నారు. Z Plus కేటగిరీ భద్రత కలిగిన NSG రక్షణలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్‌లో సాధారణంగా 12 రకాల వాహనాలు ఉంటాయి. వీటిలో అడ్వాన్స్ పైలట్, పైలట్, NSG 1, జామ్మర్, VIP వాహనం, NSG 2, ఎస్కార్ట్-1, ఎస్కార్ట్-2, VIP స్పేర్, జమీ వాహనం, అంబులెన్స్, టెయిల్-ఎండ్ వాహనం, అగ్నిమాపక వాహనం వంటివి ఉన్నాయి. నిబంధనల ప్రకారం, NSG రక్షణలో ఉన్న వ్యక్తులకు తొమ్మిది వాహనాలతో కూడిన 'బాక్స్ కాన్వాయ్' తప్పనిసరి. అయితే, ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో, కాన్వాయ్ పరిమాణాన్ని ఏ విధంగా తగ్గించాలన్న దానిపై భద్రతా సిబ్బంది ప్రస్తుతం సమాలోచనలు జరుపుతున్నారు.

# ఉత్తర్‌ప్రదేశ్‌లో గాలివాన బీభత్సం.. 54 మంది మృతి

**ఉత్తరప్రదేశ్‌లో పెను తుపాను సృష్టించిన బీభత్సం**

**ఈదురు గాలులు, వర్షానికి 54 మందికి పైగా మృతి**

**ప్రయాగ్‌రాజ్‌లో అత్యధికంగా 16 మంది మృత్యువాత**

**చెట్లు కూలి, గోడలు పడి పలువురి దుర్మరణం**

**కొనసాగుతున్న సహాయక చర్యలు.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం**



ఉత్తరప్రదేశ్‌లో నిన్న సాయంత్రం సంభవించిన పెను తుపాను తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. భారీ వర్షం, ధూళి, బలమైన ఈదురు గాలులతో కూడిన ఈ విలయానికి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మృతుల సంఖ్య 54కి చేరింది. ఈ ప్రకృతి ప్రకోపానికి వందలాది చెట్లు నేలకూలాయి, ఇళ్లు దెబ్బతిన్నాయి, విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా స్తంభించిపోయాయి. అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. అధికారిక లెక్కల ప్రకారం ప్రయాగ్‌రాజ్‌లో అత్యధికంగా 16 మంది మరణించారు. భదోహీలో 15 మంది, మీర్జాపూర్‌లో 10 మంది, ఫతేపూర్‌లో 9 మంది, హర్దోయిలో ఇద్దరు, కాన్పూర్ దేహత్, కౌశాంబి జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. ప్రయాగ్‌రాజ్‌లోని హండియా, ఫూల్‌పూర్, సోరావ్, మేజా ప్రాంతాల్లో నష్టం తీవ్రంగా ఉంది. నగరంలోని పలు ప్రధాన రహదారులపై చెట్లు కూలిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పవిత్ర త్రివేణి సంగమం వద్ద యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన గుడిసెలు సైతం గాలి ధాటికి ధ్వంసమయ్యాయి. భదోహీ జిల్లాలో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. సాయంత్రం 5 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి, దట్టమైన ధూళి తుపానుతో చీకట్లు అలుముకున్నాయి. బలమైన గాలులకు ఇళ్ల పైకప్పులు, సోలార్ ప్యానెళ్లు కొట్టుకుపోయాయి. సురియావాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖర్గసేన్‌పూర్ గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఆమె ముగ్గురు కుమార్తెలు చెట్టు కూలిన ఘటనలో మరణించడం పెను విషాదాన్ని నింపింది. బుదౌన్ జిల్లాలోనూ తుపాను తీవ్ర నష్టాన్ని కలిగించింది. బిసోలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుడిసె గోడ కూలి మౌసమి (10), రజని (9) అనే ఇద్దరు బాలికలు మృతి చెందారు. మరో ఘటనలో, తన తండ్రికి భోజనం తీసుకెళ్తున్న అన్షుల్ శర్మ (22) అనే యువకుడిపై చెట్టు విరిగిపడటంతో అక్కడికక్కడే మరణించాడు. ఓ ట్రక్కు డ్రైవర్ కూడా ఇలాంటి దుర్ఘటనలోనే ప్రాణాలు విడిచాడు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. అయితే, మొబైల్ నెట్‌వర్క్‌లు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయని అధికారులు తెలిపారు. నష్టం అంచనా ఇంకా కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న విద్యుత్, రవాణా వ్యవస్థలను పునరుద్ధరించే పనులు కొనసాగుతున్నాయి.

# ఆపద్బాంధవులైన జవాన్లు.. డ్రైవర్‌కు సీపీఆర్

**జమ్ము-శ్రీనగర్ హైవేపై గుండెపోటుతో కుప్పకూలిన డ్రైవర్**

**వెంటనే స్పందించి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన సీఆర్పీఎఫ్ జవాన్లు**

**బాధితుడిని ఆసుపత్రికి తరలింపు, ప్రస్తుతం నిలకడగా ఆరోగ్యం**

**జవాన్ల సేవపై సోషల్ మీడియాలో వెల్లువెత్తిన ప్రశంసలు**



జమ్మూ శ్రీనగర్ జాతీయ రహదారిపై సీఆర్పీఎఫ్ జవాన్లు చూపిన మానవత్వాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. జాతీయ రహదారిపై గుండెపోటుతో కుప్పకూలిపోయిన ఒక డ్రైవర్ ప్రాణాలను జవాన్లు సమయస్ఫూర్తితో కాపాడారు. సీపీఆర్ చేసి, ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించగా, అతని ప్రాణాలు నిలిచాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వివరాల్లోకి వెళ్తే, సీఆర్పీఎఫ్ 90వ బెటాలియన్ జవాన్లు అనంతనాగ్ జిల్లాలోని బిజ్‌బెహరా వద్ద జాతీయ రహదారిపై 'రూట్ ఓపెనింగ్ పార్టీ'విధుల్లో ఉన్న సమయంలో ఒక డ్రైవర్ అకస్మాత్తుగా అస్వస్థతకు గురై తన వాహనాన్ని ఆపి, రోడ్డుపై కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన జవాన్లు క్షణం కూడా ఆలస్యం చేయకుండా అతని వద్దకు పరుగెత్తారు. డ్రైవర్‌కు గుండెపోటు లక్షణాలు ఉన్నట్లు గ్రహించిన జవాన్లు వెంటనే అతనికి సీపీఆర్ (కార్డియోపల్మనరీ రిససిటేషన్) చేయడం ప్రారంభించారు. అదే సమయంలో ప్రథమ చికిత్స మందులు అందించి, అతని పరిస్థితిని నిలకడగా మార్చారు. అనంతరం, బాధితుడిని సమీపంలోని బిజ్‌బెహరా సబ్-డిస్ట్రిక్ట్ ఆసుపత్రికి తరలించారు. సరైన సమయంలో వైద్య సహాయం అందడంతో డ్రైవర్ ప్రాణాలు నిలిచాయని, ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై 90వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కమలేన్ ప్రతాప్ సింగ్ స్పందిస్తూ, "విలువైన ప్రాణాన్ని కాపాడటం మా కర్తవ్యం. అది నెరవేర్చినందుకు సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు. విధి నిర్వహణకు మించి మానవత్వాన్ని ప్రదర్శించిన జవాన్లను ఉన్నతాధికారులు, నెటిజన్లు అభినందిస్తున్నారు.

# ప్రపంచంలో 50 హాటెస్ట్ సిటీస్.. అన్నీ భారత్‌లోనే!

**ప్రపంచంలోని 50 అత్యంత వేడి నగరాలు భారత్‌లోనే ఉన్నట్లు వెల్లడి**

**ఏప్రిల్ 27న నమోదైన అసాధారణ వాతావరణ పరిస్థితి**

**గాలి నాణ్యతను పర్యవేక్షించే ఏక్యూఐ.ఇన్ నివేదికలో కీలక విషయాలు**

**ఉత్తరప్రదేశ్‌లోని బాందాలో అత్యధికంగా 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత**

**ఇది ఆధునిక కాలంలో అపూర్వమైన ఘటనేనన్న నిపుణులు**




భారతదేశం తీవ్రమైన వడగాల్పులతో అల్లాడుతున్న వేళ ఒక అసాధారణ, అపూర్వమైన రికార్డు నమోదైంది. ఏప్రిల్ 27వ తేదీన ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన టాప్ 50 నగరాలు అన్నీ భారత్‌లోనే ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గాలి నాణ్యత, వాతావరణ పర్యవేక్షణ సంస్థ 'ఏక్యూఐ.ఇన్' ఈ షాకింగ్ డేటాను విడుదల చేసింది. ఆధునిక కాలంలో ఇలాంటి ఘటనకు ఆధారాలు లేవని, ఇది 'సాధారణ ఏప్రిల్ కాదు' అని ఆ సంస్థ స్పష్టం చేసింది. ఏక్యూఐ.ఇన్ నివేదిక ప్రకారం ఏప్రిల్ 27న ప్రపంచంలోనే అత్యధిక ఉష్ణోగ్రత ఉత్తరప్రదేశ్‌లోని బాందా నగరంలో 46.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఈ జాబితాలో మధ్యప్రాచ్యం, ఆఫ్రికా లేదా ఆస్ట్రేలియా నుంచి ఒక్క నగరం కూడా లేకపోవడం గమనార్హం. జాబితాలోని 50 నగరాల్లో అత్యధికంగా ఉత్తరప్రదేశ్ నుంచి 21 నగరాలు, మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతం నుంచి 10 నగరాలు ఉన్నాయి. ఈ నగరాల్లో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 44.7 డిగ్రీలుగా ఉంది. 50 నగరాల్లో సగటు ఉష్ణోగ్రతలు మానవ శరీర ఉష్ణోగ్రత (37.5సెల్సియస్) కంటే ఎక్కువగా ఉండటం ప్రజారోగ్యానికి పెను ముప్పు అని ఏక్యూఐ.ఇన్ హెచ్చరించింది. వాతావరణ మార్పుల కారణంగానే భారత్‌లో వడగాల్పుల తీవ్రత, భౌగోళిక విస్తరణ, కాలపరిమితి పెరుగుతున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈ ఘటన, వాతావరణ మార్పుల తీవ్రతకు, భారత్‌పై దాని ప్రభావానికి ఒక స్పష్టమైన హెచ్చరికగా నిపుణులు భావిస్తున్నారు.

# అమూల్ పాల ధరలు పెరిగాయి

**లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ నిర్ణయం**

**పాల రకాన్ని బట్టి 2.5 శాతం నుంచి 3.5 శాతం మేర ధరల పెరుగుదల**

**మదర్ డెయిరీ పాల ధరలు కూడా పెంపు**




అమూల్, మదర్ డెయిరీలు పాలు, పాల పదార్థాల ధరలను పెంచాయి. ఇతర కంపెనీలు కూడా ఇదే దారిలో నడిచే అవకాశాలు ఉన్నాయి. అమూల్ బ్రాండ్లపై పాల ఉత్పత్తులు విక్రయించే గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ పాల ధరలను పెంచింది. లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అమూల్ స్టాండర్డ్ మిల్క్, గేదె పాలు, ఆవు పాలు, గోల్డ్, స్లిమ్ అండ్ ట్రిమ్, టీ స్పెషల్ పాల ధరలు లీటరుకు రూ.2 చొప్పున పెరగనున్నాయి. అమూల్ గత సంవత్సరం మే 1వ తేదీన చివరిసారి ధరలను సవరించింది. ఉత్పత్తి వ్యయం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అమూల్ తెలిపింది. పశువుల దాణా, ప్యాకేజింగ్ ఖర్చులు, చమురు ధరలు పెరుగుదల దీనికి కారణమని తెలిపింది. పాల రకాన్ని బట్టి లీటరుకు 2.5 నుంచి 3.5 శాతం మేర ధరలు పెరుగుతాయి. మదర్ డెయిరీ కూడా పాల ధరను పెంచింది. లీటరుకు రూ.2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. మే 14 నుంచి పెరిగిన పాల ధరలు అమల్లోకి రానున్నాయని తెలిపింది.

# ఏపీలో ప్రభుత్వ టీచర్ల ప్రమోషన్లకు కొత్త రూల్

**ఇకపై ఆ పరీక్ష పాసవ్వాల్సిందే!**

**ఏపీలో టీచర్ల ప్రమోషన్లకు టెట్ అర్హత తప్పనిసరి**

**సుప్రీంకోర్టు ఆదేశాలతో పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు**

**సీనియారిటీ జాబితాలో చేర్చనున్న టెట్ మార్కుల వివరాలు**

**ఉత్తమ ఉపాధ్యాయులకు ఫిన్లాండ్ విద్యా పర్యటన అవకాశం**




ఏపీలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉపాధ్యాయుల పదోన్నతులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను తప్పనిసరి చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ఉత్తమ ఉపాధ్యాయులను ప్రోత్సహించే దిశగా వారిని ఫిన్లాండ్ పర్యటనకు పంపాలని నిర్ణయించింది. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన తాజా ఆదేశాల ప్రకారం, ఇకపై స్కూల్ అసిస్టెంట్, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు టెట్ అర్హతను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటారు. జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) నిబంధనలు, గతేడాది సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 1 నుంచి 8వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులు సర్వీసులో ఎప్పుడు చేరినప్పటికీ, ప్రమోషన్ సమయంలో టెట్ అర్హత సాధించి ఉండాల్సిందే. ఈ నిబంధన అమలు కోసం స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల సీనియారిటీ జాబితాలో టెట్‌కు సంబంధించి ప్రత్యేకంగా ఒక కాలమ్‌ను చేర్చనున్నారు. ఇందులో ఉపాధ్యాయుడు ఏపీటెట్ లేదా సీటెట్‌లో అర్హత సాధించారా లేదా, ఏ పేపర్‌లో అర్హత పొందారు, సాధించిన మార్కులు, సబ్జెక్టు, మాధ్యమం వంటి వివరాలను నమోదు చేస్తారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు గతేడాది టెట్ రాసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. మరోవైపు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న 31 మంది టీచర్లకు, సీమ్యాట్ కాంట్రాక్ట్ లెక్చరర్ సతీష్ రెడ్డికి ప్రభుత్వం ఒక అద్భుతమైన అవకాశాన్ని కల్పించింది. ఫిన్లాండ్‌లోని ప్రాథమిక విద్యా విధానంపై అధ్యయనం చేసేందుకు వీరిని ప్రభుత్వ ఖర్చులతో అక్కడికి పంపుతోంది. ఈ బృందంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా కూడా ఉంటారు. ఆగస్టు 17 నుంచి 26 వరకు వీరు ఫిన్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టుర్కును సందర్శించి అక్కడి విద్యావిధానాన్ని పరిశీలిస్తారు. పర్యటన ముగిసిన వారం రోజుల్లోగా ఏపీలో అమలు చేయడానికి వీలైన అంశాలతో ఒక సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఈ బృందాన్ని ఆదేశించారు.

# చక్కెర ఎగుమతులపై కేంద్రం నిషేధం

**సెప్టెంబర్ 30 వరకు ఆంక్షలు**

**ముడిచక్కెర, తెల్ల చక్కెర, శుద్ధి చేసిన చక్కెర ఇలా**

**అన్ని రకాల ఎగుమతులపై నిషేధం**

**ఇప్పటికే ఎగుమతి ప్రక్రియలో ఉన్న కన్సైన్‌మెంట్‌లకు**

**మినహాయింపు**




దేశంలో చక్కెర నిల్వలను పెంచడంతో పాటు, సామాన్యుడిపై ధరల భారం పడకుండా కేంద్రం అప్రమత్తమైంది. చక్కెర ఎగుమతులపై నిషేధం తక్షణమే అమల్లోకి వచ్చేలా ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు ఈ ఆంక్షలు కొనసాగనున్నాయి. ముడి చక్కెర, తెల్ల చక్కెర, శుద్ధి చేసిన చక్కెర ఇలా అన్ని రకాల ఎగుమతులపై ఈ నిషేధం వర్తిస్తుంది. ఐరోపా సమాఖ్య, అమెరికాకు కోటా ఒప్పందాల ప్రకారం జరిగే ఎగుమతులకు ఈ ఆంక్షలు ఉండవు. ప్రభుత్వాల మధ్య జరిగే ఒప్పందాలు, ఇప్పటికే ఎగుమతి ప్రక్రియలో ఉన్న కన్సైన్‌మెంట్‌లకు మినహాయింపు ఉంటుందని కేంద్ర వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ పరిస్థితులు, ఇరాన్ యుద్ధం కారణంగా తలెత్తే అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని, దేశీయ అవసరాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది.ఇప్పటికే భౌతిక ఎగుమతి ప్రక్రియలో ఉన్న సరకుల కోసం తాత్కాలిక ఏర్పాట్లను కూడా ప్రభుత్వం వివరించింది. ఉత్తర్వులు జారీ చేసేముందు ఓడలోకి చక్కెరను లోడ్ చేయడం, ప్రారంభమైన రవాణాలు కొనసాగించడానికి అనుమతి ఉందని తెలిపింది. షిప్పింగ్ బిల్లులు దాఖలు చేసి, కేటాయించిన రొటేషన్ నంబర్‌తో ఓడలు ఇప్పటికే భారతీయ ఓడరేవుల్లో సిద్ధంగా ఉన్నా ఎగుమతులు చేసుకోవచ్చని సూచించింది. ఇప్పటికే కస్టమ్స్ లేదా కస్టోడియన్‌లకు అప్పగించి, ధ్రువీకరించిన ఆధారాలతో ఎలక్ట్రానిక్ సిస్టమ్‌ల్లో నమోదు చేసిన సరకులకు కూడా తక్షణ నిషేధం నుంచి మినహాయింపు ఉందని వివరించింది. అయితే, ఇతర దేశాల నిర్దిష్ట ఆహార భద్రతా అవసరాలను తీర్చడానికి, ఆయా ప్రభుత్వాల నుంచి అధికారిక అభ్యర్థన ఉన్నా ఎగుమతులను అనుమతించవచ్చని కూడా ప్రభుత్వం పేర్కొంది. అయితే, పూర్తి నిషేధం ఉన్నప్పటికీ ప్రభుత్వం కొన్ని అంతర్జాతీయ బాధ్యతలు, ఇప్పటికే ఉన్న పథకాలకు నిర్దిష్ట మినహాయింపులను ఇచ్చింది.కోటాల కింద యూరోపియన్ యూనియన్, అమెరికాకు ఎగుమతి చేసే చక్కెరపై ఈ నిషేధం వర్తించదని తెలిపింది. సంబంధిత పబ్లిక్ నోటీసుల్లో నిర్దేశించిన విధానాల ప్రకారం ఈ ఎగుమతులు కొనసాగుతాయని పేర్కొంది. 2025-26 సంవత్సరానికి (అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు) ఆహార మంత్రిత్వ శాఖ మొదటగా 15 లక్షల టన్నుల చక్కెర ఎగుమతులకు అనుమతించింది. ఆ తర్వాత అదనంగా 5,00,000 టన్నుల పూల్‌ను తెరవగా, అందులో కేవలం 87,587 టన్నులకు మాత్రమే ఆమోదం లభించింది. ఫలితంగా దాదాపు 16 లక్షల టన్నుల చక్కెర మాత్రమే ఎగుమతికి అనుమతి లభించింది. ఆహార మంత్రిత్వ శాఖ, చక్కెర మిల్లులు మొత్తం 2025-26 మార్కెటింగ్ సంవత్సరంలో 7.5-8 లక్షల టన్నుల రవాణాను అంచనా వేశాయి.మహారాష్ట్ర, కర్ణాటకల్లో అధిక ఉత్పత్తి కారణంగా 2025-26 మార్కెటింగ్ సీజన్‌లో ఏప్రిల్ వరకు భారతదేశ చక్కెర ఉత్పత్తి 7.32 శాతం పెరిగి 27.52 మిలియన్ టన్నులకు చేరుకుందని పరిశ్రమల సంస్థ వెల్లడించింది. 2025-26 మార్కెటింగ్ సీజన్‌లో ఇథనాల్ మళ్లింపు తర్వాత మొత్తం ఉత్పత్తి 29.3 మిలియన్ టన్నులుగా ఉంటుందని అంచనా వేసింది. అంతకుముందు 2024-25లో నమోదైన 26.12 మిలియన్ టన్నులుగా ఉంది. 2022 అక్టోబర్లో భారతదేశం చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఆ తర్వాత ఆంక్షలను ఎప్పటికప్పుడు పొడిగిస్తూ వచ్చింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారు అయిన భారత్ చక్కెర మిల్లుల మధ్య దామాషా పద్ధతిలో కేటాయిస్తూ ఎగుమతులను ప్రభుత్వ నియంత్రణలో ఉంచుతుంది. ద్రవ్యోల్బణ ఆందోళనలు, పశ్చిమాసియా ఘర్షణ వల్ల నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

# భారత ఎకానమీకి ఏఐ బూస్ట్- 2030 నాటికి రూ.47 లక్షల కోట్లు యాడ్!

**ఏఐలో భారత్‌కు అవకాశాలు ఎక్కువే**

**ఏఐ స్వీకరణలో వెనుకంజలో ఉన్నామన్న 72 శాతం భారత కంపెనీలు**

**2030 నాటికి 35 కోట్ల మందికిపైగా ఏఐ నిపుణులు అవసరం**



2030 నాటికి భారతదేశ ఆర్థిక వ్యవస్థకు దాదాపు రూ.47.81 లక్షల కోట్ల (500 బిలియన్ డాలర్ల)కు పైగా దోహదపడే సామర్థ్యం కృత్రిమ మేధ (ఏఐ)కు ఉందని అంచనా వేశారు. అమెరికన్ కంపెనీ ఐబీఎం, భారత ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖకు చెందిన ఇండియాఏఐ మిషన్ సంయుక్తంగా నిర్వహించిన తాజా అధ్యయనంలో ఈ కీలక అంశాన్ని గుర్తించారు. ఇందులో భాగంగా భారత్‌లోని వివిధ సంస్థలు, పరిశ్రమలలో వేర్వేరు నాయకత్వ స్థాయిల్లో సేవలను అందిస్తున్న 1,500 మందికిపైగా నిర్వాహకులు, ఉన్నతాధికారులను సర్వే చేశారు.ఆయా కంపెనీలు, పరిశ్రమల్లోని చీఫ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్ల (జశూం) అభిప్రాయాలనూ సేకరించారు. ఈ సర్వేకు అదనంగా మరో 405 మంది భారతీయ ఎగ్జిక్యూటివ్‌లతో (ఉన్నతాధికారులు) ఒక పల్స్ సర్వేను కూడా నిర్వహించారు. సర్వేలో పాల్గొన్న భారతీయ వ్యాపార నిర్వాహకుల్లో 80 శాతం మంది ఏఐ పెట్టుబడులు దేశ జీడీపీ వృద్ధిని నేరుగా ప్రభావితం చేస్తాయనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈమేరకు వివరాలతో 'ఫ్రం ప్రామిస్ టు పవర్ : హౌ ఏఐ ఈజ్ రీడిఫైనింగ్ ఇండియాస్ ఎకనామిక్ ఫ్యూచర్' శీర్షికన అధ్యయన నివేదికను విడుదల చేశారు.2030 నాటికి భారతదేశ ఆర్థిక వ్యవస్థకు దాదాపు రూ.47.81 లక్షల కోట్ల (500 బిలియన్ డాలర్ల)కుపైగా దోహదపడే సామర్థ్యం కృత్రిమ మేధ (ఏఐ)కు ఉంది. తద్వారా ప్రపంచంలో అత్యంత వేగవంతంగా ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థలుగా ఎదిగే దేశాల జాబితాలోకి భారత్ చేరుతుంది.భారతదేశం స్థాయిలో జనాభా, డిజిటల్ సామర్థ్యం, ఉన్నత ఆశయాలతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలోకి అడుగుపెడుతున్న దేశాలు ప్రపంచంలో చాలా తక్కువగానే ఉన్నాయనే అభిప్రాయం సర్వేలో పాల్గొన్న వారిలో వ్యక్తమైంది.2030 నాటికి భారత్ ఒక అగ్రగామి ఏఐ దేశంగా అవతరిస్తుందని సుమారు 73 శాతం మంది భారతీయ ఎగ్జిక్యూటివ్‌లు అభిప్రాయపడ్డారు. విస్తారమైన మార్కెట్, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలు, ప్రపంచంలోనే అతిపెద్ద సంఖ్యలో ఐటీ నిపుణులు ఉండటం అనే అంశాలు భారత్‌కు కలిసొస్తాయనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.ఈ సర్వేలో పాల్గొన్న కంపెనీలు, పరిశ్రమల్లో 72 శాతం, తాము ఏఐ టెక్నాలజీ స్వీకరణ విషయంలో ఇతర అంతర్జాతీయ కంపెనీల కంటే వెనుకంజలో ఉన్నామని అంగీకరించాయి.కంపెనీలు, పరిశ్రమల్లో ఐటీ, హెచ్‌ఆర్, ఫైనాన్స్, ఆపరేషన్స్, సేల్స్ విభాగాలు ఉంటాయి. ఐటీ సహా అన్ని విభాగాలకూ ఏఐ సేవలను విస్తరిస్తే దాన్ని క్రాస్ ఫంక్షనల్ ఇన్వెస్ట్‌మెంట్ అంటారు. ప్రస్తుతం భారత్‌లోని కేవలం 15 శాతం కంపెనీలే క్రాస్ ఫంక్షనల్ ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా అన్ని విభాగాల్లో ఏఐ టెక్నాలజీ వినియోగాన్ని పెంచుతున్నాయి. మిగితా 85 శాతం కంపెనీలు ఈవిషయంలో ఇంకా పైలట్ దశలోనే ఉన్నాయి.భారత్‌లో ఇప్పటికీ చౌకైన, సురక్షితమైన క్లౌడ్ మౌలిక సదుపాయాల కొరత ఉందని సర్వేలో పాల్గొన్న 77 శాతం కంపెనీలు, పరిశ్రమలు చెప్పాయి. తమ సంస్థల్లో ఏఐ సేవల విస్తరణకు క్లౌడ్ మౌలిక సదుపాయాల కొరతే పెద్ద ఆటంకంగా మారిందని తెలిపాయి.ఏఐ వ్యవస్థలు సరిగ్గా పనిచేయాలంటే వాటికి నాణ్యమైన డేటా చాలా అవసరం. ర్వేలో పాల్గొన్న 57 శాతం మంది ఎగ్జిక్యూటివ్‌లు తమ సంస్థలలో ఉన్న డేటా అంతా ఒకే నాణ్యతతో లేదన్నారు. దానివల్లే ఏఐని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నామని చెప్పారు.తమ సంస్థల్లోని కేవలం 30 శాతం మంది ఉద్యోగులే వ్యాపారాలకు అవసరమైన స్థాయిలో ఏఐ అక్షరాస్యతను కలిగి ఉన్నారని సర్వేలో పాల్గొన్నవారు తెలిపారు. ఇంత భారీగా ఏఐ నిపుణుల కొరత ఉండటం అనేది ఏఐ సేవల విస్తరణకు పెద్ద సవాల్‌గా మారిందన్నారు.భవిష్యత్ అవసరాలను తీర్చడానికి, 2030 నాటికి తమ సంస్థల్లోని ఏఐ నిపుణుల సంఖ్య కనీసం 57 శాతానికి పెరగాలని సర్వేలో పాల్గొన్న వారు చెప్పారు.ఈ లెక్కన 2030 నాటికి భారత్‌లోని పరిశ్రమలు, కంపెనీల కోసం 35 కోట్ల మందికిపైగా ఏఐ నిపుణులు అవసరమని అధ్యయన నివేదిక అంచనా వేసింది.'భారతదేశం ఇకపై కేవలం ప్రపంచ ఏఐ చర్చలో పాల్గొనడమే కాకుండా, దాన్ని తీర్చిదిద్దడంలోనూ సహాయపడుతుంది. మా దృక్పథం స్పష్టం. ఏఐ టెక్నాలజీ మనదేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిణామం చెందాలి. అది సమ్మిళిత వృద్ధికి, జాతీయ పురోగతికి దోహదపడాలి. వికసిత భారత్ దార్శనికతకు అనుగుణంగా విశ్వాసం, నైతికత, జాతీయ సార్వభౌమత్వాలను ప్రాతిపదికలుగా కలిగిన మానవ కేంద్రీకృత ఏఐ విధానాన్ని మేం ముందుకు తీసుకెళ్తున్నాం' అని భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ తెలిపారు.'భారత ఆర్థిక వ్యవస్థకు అత్యంత శక్తివంతమైన వృద్ధిని అందించే మాధ్యమంగా ఏఐ మారగలదు. ఏఐ టెక్నాలజీ స్వీకరణ స్థాయితో పాటు పటిష్టమైన డేటా పునాదులు, హైబ్రిడ్ ఆర్కిటెక్చర్‌లు, ఐటీ నిపుణులు, విశ్వసనీయమైన ఏఐ ఏజెంట్లు, వ్యవస్థలను నిర్మించగల దేశీయ సంస్థలు భారతదేశాన్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. ఏఐ నైపుణ్యాలు, నిర్వహణ, మౌలిక సదుపాయాలలో సరైన పెట్టుబడులు పెడితే భారతదేశం ఏఐ ఆశయాలను సాధించి, వాటితో ఆర్థిక ఉన్నతిని అందుకోవచ్చు' అని ఐబీఎం ఇండియా అండ్ సౌత్ ఏషియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ చెప్పారు.

# బ్యాంక్ అకౌంట్ ఉన్న ప్రతి ఒక్కరూ "ఈ రూల్స్" తెలుసుకోవాలి!

**కొన్ని సందర్భాల్లో పరిహారం లభిస్తుంది!**

**మీకు బ్యాంక్ అకౌంట్ ఉందా**

**ఈ విషయాలు తెలుసుకుంటే ఎన్నో విధాలుగా**

**మేలు జరుగుతుందని నిపుణుల సూచన!**




ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరికీ బ్యాంక్ అకౌంట్ ఉంది. ఎలాంటి చిన్న ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలన్నా ఏదో ఒక బ్యాంకులో ఖాతా ఉండాల్సిందే. అందుకే మెజార్టీ పీపుల్ రెండు మూడు అకౌంట్లు ఓపెన్ చేస్తుంటారు. అంతేకాకుండా అవసరాలను బట్టి రకరకాల రుణాలు కూడా తీసుకుంటుంటారు. ఇంతవరకు బానే ఉన్నా చాలా మందికి బ్యాంక్ రూల్స్ సరిగ్గా తెలియవు. మరీ ముఖ్యంగా గ్రామాల్లో ఉండేవారికి. దీంతో ఆయా పనుల కోసం రోజుల తరబడి తిరుగుతుంటారు. ఈ క్రమంలోనే ప్రజలు తెలుసుకోవాల్సిన రూల్స్‌ను మీకోసం తీసుకొచ్చాం. వీటిని తెలుసుకోవడం వల్ల ఆయా సందర్భాల్లో బ్యాంకుల నుంచి పరిహారం కూడా పొందొచ్చు. ఇంతకీ ఆ రూల్స్ ఏంటో ఈ స్టోరీలో చూద్దాం.ట్రాన్సాక్షన్ ఫెయిల్ అయితే: అకౌంట్లో డబ్బులు కట్ అవుతాయి. కానీ, ఏటీఎం నుంచి డబ్బులు రావు. ఈ సమస్యను చాలా మంది ఫేస్ చేసే ఉంటారు. అయితే, ఇలాంటి ప్రాబ్లమ్ ఎదురైనప్పుడు ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతుంటారు. ఈ నేపథ్యంలోనే రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా కొన్ని మార్గదర్శకాలు తీసుకొచ్చింది. విఫలమైన లావాదేవీలను టర్న్ అరౌండ్ టైమ్(టీఏటీ) పద్ధతిలో పరిష్కరించాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది. పరిష్కారంలో జాప్యం జరిగితే నష్టపరిహారం చెల్లించాలని కూడా బ్యాంకులకు స్పష్టం చేసింది.ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం వినియోగదారుడు ఏటీఎమ్ వద్ద లావాదేవీలు నిర్వహించినప్పుడు, అకౌంట్ నుంచి నగదు డెబిట్ అయ్యి ఏటీఎమ్ నుంచి డబ్బులు రాకపోతే.. ట్రాన్సాక్షన్ జరిగిన రోజు నుంచి 5 పనిదినాల్లో ఆ సమస్యను పరిష్కరించాలి.ఒకవేళ 5 రోజులలో పరిష్కరించకపోతే సదరు బ్యాంక్ గడువు ముగిసిన నాటి నుంచి నష్టపరిహారంగా.. రోజుకు రూ.100 ఆయా ఖాతాదారునికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ రూల్ కేవలం ఏటీఎం ట్రాన్సాక్షన్ మాత్రమే కాకుండా ఆన్‌లైన్, పర్సన్ టూ పర్సన్ వంటి లావాదేవీలకు వర్తిస్తుంది.హోమ్ లోన్ విషయంలో: నేటి రోజుల్లో చాలా మంది సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు గృహరుణాలు తీసుకుంటున్నారు. అయితే హోమ్ లోన్ కోసం అప్లై చేసినప్పుడు తాకట్టు కింద బ్యాంకులు కొన్ని డాక్యుమెంట్స్ తీసుకుంటాయి. అలాగే మీరు ఏయే పత్రాలను సమర్పించారో లోన్ మంజూరు సమయంలో బ్యాంకు వాటి వివరాలను మీకు తెలియజేస్తుంది. లోన్ పూర్తి కాగానే బ్యాంకు నుంచి మీరు తాకట్టు పెట్టిన డాక్యుమెంట్స్ తీసుకోవాలి. ఏ ఒక్కదాన్నీ బ్యాంకులు లేదా ఫైనాన్స్ కంపెనీలు అట్టిపెట్టుకునే అధికారం లేదు. దీనికి సంబంధించి 2023లో నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది ఆర్బీఐ.దాని ప్రకారం.. లోన్ పూర్తిగా చెల్లించిన 30 రోజుల లోపు ఆస్తి పత్రాలను (చర లేదా స్థిరాస్తుల పత్రాలు) బ్యాంకులు ఇవ్వాలి. ఈ డాక్యుమెంట్స్‌ను తిరిగి ఇవ్వడంలో లేదా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఛార్జ్ (రాఆవఆ) తొలగింపు ఫారమ్ దాఖలు చేయడంలో ఆలస్యం జరిగితే, ఆ ఆలస్యానికి గల కారణాలను (రెగ్యులేటెడ్ ఎంటిటీ) కస్టమర్‌కు తెలియజేయాలి. ఒకవేళ ఆ ఆలస్యం బ్యాంకు నిర్లక్ష్యం వల్ల జరిగితే, ఆలస్యమైన ప్రతి రోజుకూ రూ. 5 వేల చొప్పున కస్టమర్‌కు పరిహారం చెల్లించాలి. ఈ రూల్ డిసెంబర్ 1, 2023 తర్వాత లోన్ క్లోజ్ అయిన అన్ని కేసులకూ వర్తిస్తుంది.క్రెడిట్ కార్డ్ విషయంలో రూల్స్ ఇలా: ఉద్యోగులు, వ్యాపారులు, సామాన్యులు ఇలా ప్రతి ఒక్కరూ క్రెడిట్ కార్డ్ తీసుకుంటున్నారు. ప్రయోజనాలు ఎక్కువ ఉండటం వల్ల చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. అయితే, కొద్దిమంది టైమ్ టు టైమ్ బిల్లులు కట్టలేక సహా ఇతర కారణాల వల్ల క్రెడిట్ కార్డ్ క్లోజ్ చేయమని ఆయా బ్యాంకుల్లో అప్లికేషన్ పెట్టుకుంటుంటారు. కానీ, ఈ విషయంలో బ్యాంకులు ఆలస్యం చేస్తుంటాయి. అయితే మీకు తెలుసా? క్రెడిట్ కార్డ్ క్లోజ్ చేయమని అప్లికేషన్ ఇచ్చిన 7 రోజుల్లో పని పూర్తి కావాలి. అలా అవ్వని పక్షంలో 7 రోజుల పూర్తైన తర్వాత నుంచి రోజుకు రూ.500 పరిహారంగా చెల్లించాలి.

# ఈపీఎఫ్‌వో కీలక నిర్ణయం

**ఇకపై రిటైర్మెంట్ ఫండ్స్‌కు ఆటోమేటిక్ విత్‌డ్రా సదుపాయం**

**కీలక నిర్ణయం తీసుకున్న ఈపీఎఫ్‌వో**

**అడ్వాన్స్ విత్‌డ్రాకే పరిమితమైన ఆటోమేటిక్ విధానం**

**ఇకపై రిటైర్మెంట్ సమయంలోనూ!**




ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ నగదు విత్‌డ్రా విధానాన్ని మరింత సులభతరం చేసేందుకు సిద్ధం అవుతోంది. ఎంప్లాయి రిటైర్మెంట్ సమయంలో ఫండ్స్ విత్‌డ్రా ప్రాసెస్‌ను ఆటోమేట్ చేయనుంది. ఈ సదుపాయంతో రిటైర్మెంట్ అయిన కొద్ది రోజులకే సంబంధిత వ్యక్తి బ్యాంక్ అకౌంట్‌లోకి మొత్తం ఫండ్ క్రెడిట్ అయ్యేలా చర్యలు తీసుకోబోతోందని ఈపీఎఫ్‌వో ఉన్నత స్థాయి వర్గాలు తాజాగా వెల్లడించాయి.అయితే ఈపీఎఫ్‌కు సంబంధించి అడ్వాన్స్ ఫండ్స్ విత్‌డ్రాలో ప్రస్తుతం రూ.5 లక్షల వరకు మాత్రమే ఆటోమేట్ విధానం అమలు అవుతోంది. క్లెయిమ్ చేసిన తర్వాత మూడు రోజుల్లో ఫండ్ అకౌంట్‌లో క్రెడిట్ అవుతోంది. అయితే ఇదే విధానాన్ని రిటైర్మెంట్ అయ్యే వారి విషయంలో కూడా వర్తింపజేసేలా ఈపీఎఫ్ఓ ప్లాన్ చేస్తోంది. ఈ మేరకు సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ రమేశ్ కృష్ణమూర్తి తాజాగా లేబర్ కోడ్‌ల అంశంపై అసోచామ్ నిర్వహించిన సెమినార్‌లో వెల్లడించారు. దీంతోపాటుగా ప్రస్తుతం అడ్వాన్స్ నిధుల ఉపసంహరణలో ఉన్న ఈ ఆటో విత్‌డ్రా సదుపాయాన్ని ఫైనల్ సెటిల్‌మెంట్‌కూ త్వరలో వర్తింపజేయనున్నట్లు రమేశ్ కృష్ణమూర్తి వెల్లడించారు.అంతేకాకుండా ఒక ఉద్యోగి ఒక కంపెనీ నుంచి మరో కంపెనీకి మారేటప్పుడు పీఎఫ్ అకౌంట్‌లో ఉన్న మొత్తాన్ని కూడా ఆటో ట్రాన్స్‌ఫర్ చేసేలా కొత్త సదుపాయాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ఇక నుంచి మాన్యువల్‌గా ఏమీ చేయాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. వీటితోపాటుగా కొత్త లేబర్ కోడ్‌లకు అనుగుణంగా ఈపీఎఫ్ స్కీమ్ 1952, డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ 1976, ఎంప్లాయి పెన్షన్ స్కీమ్ 1995కు సంబంధించిన రూల్స్‌ను కూడా త్వరలోనే మళ్లీ పరిశీలించున్నట్లు చెప్పారు.

# ఏ క్షణమైనా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే ఛాన్స్

**ఆర్‌బీఐ గవర్నర్**

**పెరిగిన ఆయిల్ ధరలను ఇప్పటివరకు ప్రభుత్వమే భరించింది**

**యుద్ధం ఇలానే కొనసాగితే ధరల ప్రభావం వినియోగదారులపై పడే అవకాశం ఉంది**

**ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా**



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. పెరిగిన చమురు ధరలను ఇప్పటివరకు ప్రభుత్వమే భరించిందని గుర్తుచేశారు. అయితే పరిస్థితి ఇలానే కొనసాగితే, ధరల ప్రభావం వినియోగదారులపై పడే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), స్విస్ నేషనల్ బ్యాంక్ సంయుక్తంగా నిర్వహించిన 12వ ఉన్నత స్థాయి అంతర్జాతీయ ద్రవ్య విధాన సదస్సులో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు."పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలై ఇప్పటికే సుమారు 75 రోజులు అయ్యింది. ఇప్పటి వరకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగినప్పటికీ ప్రభుత్వమే వాటిని భరిస్తూ వచ్చిది. అయితే, యుద్ధం ఇలానే కొనసాగితే ధరలు ఏ క్షణమైనా పెంచే అవకాశం ఉంది."కొవిడ్ మహమ్మారి కాలంలో జీడీపీలో 9.2 శాతంగా ఉన్న ద్రవ్య లోటును దాదాపు 4.3 శాతానికి తగ్గించడం ద్వారా ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటించిందని, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేసిందని మల్హోత్రా తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ద్రవ్యోల్బణ అంచనాలను అదుపులో ఉంచడానికి ద్రవ్య విధానం ముఖ్యమైనదని, అయితే అది ఒక్కటే ప్రధాన సరఫరా-సరుకు లోటు సమస్యలను ఎదుర్కొనడానికి సరిపోకపోవచ్చని ఆయన పేర్కొన్నారు.పశ్చిమాసియా ఉద్రిక్తతలను దృష్టిలో ఉంచుకొని, నిరంతర అనిశ్చితుల మధ్య పనిచేయడానికి కేంద్ర బ్యాంకులు అలవాటు పడ్డాయని మల్హోత్రా చెప్పారు. ఆర్థిక నమూనాలు, మారుతున్న ప్రవర్తనా విధానాలు, అందుబాటులోకి వచ్చే డేటాకు సంబంధించిన అనిశ్చితులను ద్రవ్య విధానం క్రమం తప్పకుండా ఎదుర్కొంటుందని, అందుకే తీవ్ర అనిశ్చితి నెలకొన్న సమయాల్లో పాలసీదారులు అత్యంత ఖచ్చితమైన నిర్ణయాల కోసం చూడకుండా, జాగ్రత్తలపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. విశ్వసనీయతను కాపాడుకోవడానికి, ద్రవ్యోల్బణ అంచనాలను అదుపు చేయడానికి ఇలాంటి పరిస్థితుల్లో క్రమబద్ధత, పాలసీ కమ్యూనికేషన్, కేంద్ర బ్యాంక్ స్వయంప్రతిపత్తి మరింత ముఖ్యమైనవని ఆయన స్పష్టం చేశారు.సరఫరా లోటుకు సంబంధించి భారతదేశానికి ఉన్న సున్నితత్వాన్ని గవర్నర్ ప్రస్తావిస్తూ, తాజా సవరణ తర్వాత వినియోగదారుల ధరల సూచీ బాస్కెట్‌లో ఆహార వస్తువుల వాటా దాదాపు 46 శాతం నుంచి తగ్గినా, ఇప్పటికీ అది దాదాపు 40 శాతంగా ఉందని అన్నారు. అందుకే దేశం ఈ ప్రభావానికి ఎక్కువగా గురవుతుందని చెప్పారు. తాత్కాలిక, స్వల్పకాలిక సరఫరా లోటులను కొన్నిసార్లు పట్టించుకోకుండా వదిలేయవచ్చని, అయితే వీటి ద్వితీయ శ్రేణి ప్రభావాలు విస్తృత ఆర్థిక వ్యవస్థ అంతటా వ్యాపించి, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు సాధారణీకరణ చెందితే పాలసీదారులు తప్పనిసరిగా జోక్యం చేసుకోవాలని మల్హోత్రా పేర్కొన్నారు.పశ్చిమాసియా ప్రాంతంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో, ఆ ప్రాంతంపై భారతదేశం ఆధారపడటాన్ని కూడా మల్హోత్రా హైలైట్ చేశారు. భారతదేశ మొత్తం దిగుమతులలో ఆరో వంతు ఆ ప్రాంతం నుంచే వస్తుండగా, ఎగుమతులలో ఆరో వంతు అక్కడికే వెళ్తున్నాయని ఆయన చెప్పారు. దీనికి తోడు, విదేశాల నుంచి వచ్చే నిధులలో దాదాపు 40 శాతం, ఎరువుల దిగుమతులలో 40 శాతం, గ్యాస్ సరఫరాలో దాదాపు 60 శాతం ఆ ప్రాంతంతోనే ముడిపడి ఉన్నాయని, ఇది ఆ ప్రాంత పరిణామాలకు భారతదేశాన్ని ఎంతగానో గురిచేస్తుందని వివరించారు. ఇటువంటి వాతావరణంలో, వేగంగా మారుతున్న అంతర్జాతీయ, దేశీయ పరిస్థితులకు అనుగుణంగా ద్రవ్య విధానం అత్యంత అనువైనదిగా, చురుకైనదిగా, వేగవంతమైనదిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.



RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య





## శర్వానంద్--శ్రీను వైట్ల క్రేజీ కాంబో.. హీరోయిన్‌గా మానస!

శర్వానంద్ వరుస విజయాలతో దూసుకుపోతూ ఇప్పుడు కామెడీ కింగ్ శ్రీను వైట్లతో కొత్త ప్రాజెక్ట్‌ను ఖరారు చేశారు. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో కూడిన ఈ సినిమా వినోదానికి సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ జోడించబోతున్నట్లు సమాచారం. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత అనిల్ సుంకర నిర్మాణంలో జులై 2026 నుంచి షూటింగ్ ప్రారంభమై వచ్చే సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో శర్వానంద్ సరసన నటించబోయే హీరోయిన్‌గా మొదట పూజా హెగ్డే, మమితా బైజు వంటి స్టార్ హీరోయిన్ల పేర్లు ప్రచారంలోకి వచ్చినా తాజా సమాచారం ప్రకారం 'మిస్ ఇండియా' రన్నరప్ మానస వారణాసి ఎంపికైనట్లు టాలీవుడ్ టాక్. ఇటీవల 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాలో తన నటనతో మానస మంచి గుర్తింపు తెచ్చుకుంది. దాంతో మానస, శర్వాతో జోడీ కట్టడం ఫ్రెష్ ఫీల్‌ను తెస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ తుది దశలో ఉంది. త్వరలోనే హీరోయిన్‌తో పాటు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రస్తుతం సంపత్ నంది దర్శకత్వంలో 1960ల నాటి పీరియడ్ డ్రామా 'భోగి' షూటింగ్‌లో శర్వానంద్ బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఉత్తర తెలంగాణ – మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ స్టోరీని పాన్ ఇండియా రేంజ్‌లో నిర్మిస్తున్నారు. ఇందులో రోహిత్ పాఠక్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. 'భోగి' చిత్రం ఆగస్టు 28, 2026న థియేటర్లలో విడుదల కానుంది.

## వన్స్‌మోర్.. అల్లు అర్జున్‌తో 'బుట్టబొమ్మ' రొమాన్స్..!



టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ ప్రస్తుతం రాకా సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఇదిలా ఉంటే మరోవైపు తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చేశాడు. ‍‍‍ఏఏ23గా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త మూవీ లవర్స్‌ను ఎక్జయిటింగ్ అయ్యేలా చేస్తోంది. పొడుగు కాళ్ల సుందరి పూజా హెగ్డే ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించనుందట.

పూజా హెగ్డే ఇప్పటికే బన్నీతో కలిసి దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురంలో సినిమాల్లో నటించింది. సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేసిన ఈ బుట్టబొమ్మ మరోసారి అల్లు అర్జున్‌తో నటించబోతుందన్న వార్తను మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు, ఫాలోవర్లు ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఏఏ23 ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. అల్లు అర్జున్ నటిస్తోన్న రాకా షూటింగ్ పూర్తయిన తర్వాత ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లనుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి అనిరుద్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. గతేడాది రజినీకాంత్ టైటిల్ రోల్‌లో నటించిన కూలీ సినిమాలో మోనికా సాంగ్‌లో మెరిసింది. విజయ్‌తో నటించిన జయనాయగన్ విడుదలకు రెడీ అవుతోంది. తెలుగులో దుల్కర్ సల్మాన్ డీక్యూ41లో హీరోయిన్‌గా నటిస్తోంది. మరోవైపు తమిళంలో నటిస్తోన్న కాంచన 4 చిత్రీకరణ దశలో ఉంది.



## ఇక 7 రోజులు మాత్రమే'.. బర్త్ డేకు బిగ్ సర్‌ప్రైజ్

జూనియర్ ఎన్టీఆర్– ప్రశాంత్ నీల్ కాంబోలో వస్తోన్న పీరియాడికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ డ్రాగన్(ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ చిత్రంలో కాంతార బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ సినిమా అప్‌డేట్స్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈనెల 20న యంగ్ టైగర్ బర్త్ డేకు ఏదైనా సర్‌ప్రైజ్ ఇస్తారా? అని వెయిటింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ నెల 20న జూనియర్ బర్త్ డే సందర్భంగా డ్రాగన్ ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. ఇంకా కేవలం 7 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని చిత్ర బృందం ట్వీట్ చేసింది. దీంతో యంగ్ టైగర్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. కాగా.. ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ యేర్నేని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది థియేటర్లలో సందడి చేయనుంది.



## సమంత 'మా ఇంటి బంగారం' కొత్త రిలీజ్ డేట్.. యాంగ్రీ లుక్‌తో అదిరిపోయిన పోస్టర్!

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మా ఇంటి బంగారం'పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఫీమేల్ సెంట్రిక్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తుండటంతో సినీ అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. మొదట ఈ సినిమాను మే 15న విడుదల చేయాలని మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీ రిలీజ్ వాయిదా పడింది. దీంతో అభిమానులు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. తాజాగా చిత్రబృందం అధికారిక ప్రకటనతో క్లారిటీ ఇచ్చింది. 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని జూన్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సంప్రదాయ పట్టుచీరలో కనిపిస్తున్న సమంత చేతిలో తుపాకీ పట్టుకుని సీరియస్, యాంగ్రీ లుక్‌లో కనిపించడం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. పోస్టర్‌ను చూస్తుంటే సినిమాలో ఆమె పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై మంచి బజ్ ఏర్పడగా.. తాజా పోస్టర్ ఆ హైప్‌ను మరింత పెంచింది. ముఖ్యంగా సమంత గత కొంతకాలంగా విభిన్న కథలను ఎంచుకుంటూ నటిగా కొత్త కోణాలను చూపిస్తోంది. ఈ క్రమంలో 'మా ఇంటి బంగారం' కూడా ఆమె కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు సంతోష్ నారాయణ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు సినిమాకు అదనపు బలంగా నిలుస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక సమంతకు గత కొంతకాలంగా సోలో హిట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.



## ఉదయ్ కిరణ్ హీరోయిన్ మూవీ.. రిలీజ్ ఎప్పుడంటే?

నాజర్, అంజలి ప్రధాన పాత్రల్లో వస్తోన్న ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్ ముసలోడికి దసరా పండుగ. ఈ సినిమాకు మనోహర్ దర్శకత్వం వహించారు. రమణా ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మాత రమణ వాళ్లె నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా మే 15న థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే రిలీజైన ట్రైలర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సందర్భంగా నిర్మాత రమణ మాట్లాడుతూ.. "ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే రెండు గంటల పాటు కష్టాలన్నీ మర్చిపోయి హాయిగా నవ్వుకునేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాం. సినిమా అవుట్‌పుట్ పట్ల మేము చాలా ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమా ప్రతి ఒక్కరికి నచ్చుతుందని నమ్మకముంది. ఈ సినిమాను మా పితృ సమానులు దివంగత దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు అంకితమిస్తున్నాం" అని తెలిపారు. ఈ సినిమాలో అనిత (నువ్వు నేను ఫేం), కోవై సరళ, శరణ్య, సత్య కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీకి డి. ఇమాన్ సంగీతమందించారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.